సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి డిసెంబర్ సోమవారం 26 - ఆదివారం 1 జనవరి 2017 సంపుటి : 2 సంచిక 14 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

వివరాలు 2లో...



అసమర్థ కంపెనీలతో నవ్యాంధ్ర రాజధాని సాధ్యమా ?

వివరాలు 3లో...



అమలోద్భవి ఒడిలో లోకరక్షకుడు

వివరాలు 4లో...



కూల్‌డ్రింక్స్‌ను మానండి

వివరాలు 5లో...



మైనారిటీ హక్కుల సాధనకు కృషి చేద్దాం

వివరాలు 8లో...



నోరూరించే క్రిస్మస్ కేక్‌లు రెడీ




## సీఎం చంద్రబాబు క్రిస్మస్ శుభాకాంక్షలు



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రైస్తవులకు తెలుగుదేశం పార్టీ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ మనుషులందరినీ సన్మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. క్రిస్మస్ పండుగను అందరూ ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## వైఎస్ జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలు



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రైస్తవులకు వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం.. ఇవన్నీ మానవాళికి జీసస్ ఇచ్చిన సందేశమని ఆయన పేర్కొన్నారు.

## నోట్ల రద్దుపై 27న ప్రధాని సమీక్ష

**ఢిల్లీ:** నోట్ల రద్దు అనంతర పరిస్థితులపై సమీక్షించడానికి ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం (ఈ నెల 27) ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు, ఆర్థికవేత్తలు, ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమలు తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారని విశ్వసనీయవర్గాల కథనం. నగదు కొరత కారణంగా అసంఘటిత రంగంలోనివారు ఉపాధి కోల్పోతుండడం, తదితర సమస్యల పరిష్కారానికి వ్యూహం రూపొందించనున్నారు. డిజిటల్ లావాదేవీలను పెంచడంపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించనున్నారు. నోట్ల రద్దుతో ఆర్థిక ప్రగతి మందగిస్తుందని రిజర్వు బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సహా పలు సంస్థలు చెప్పిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకొంది.

## ఈవారం రాజధాని

- విజయవాడలో జనవరి 1 నుంచి పుస్తక మహోత్సవం
- 25న కమాక్యా-బెంగుళూరు రైలు ప్రారంభం : రైల్వే మంత్రి సురేష్ ప్రభు
- 27 నుంచి డివిజన్ స్థాయి విద్యాశాఖ సమీక్షలు : విద్యాశాఖాధికారి కె.వి. శ్రీనివాసులురెడ్డి
- జనవరి 12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం : ప్రిన్సిపల్ డాక్టర్ పి.ముత్యం
- ఆధార్ నెంబరుతో నగదు రహిత కొనుగోళ్లు :అధికారులు, మంత్రులు
- రాజధాని రైతులకు వెంటనే పెన్షన్ ఇవ్వాలి : ఆర్కే
- 26లోగా 'ఇస్కా' పనులు పూర్తి :రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు
- 2018 నాటికి ఎయిమ్స్ నిర్మాణం : కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు
- జనవరి 27 నుంచి గ్రంథాలయ కోర్సు పరీక్షలు
- 31 వరకు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు -చైర్మన్ అతులె సింగ్

# నగరవాసులను ఆకట్టుకున్న నాట్య సమ్మేళనం







రాజధాని ప్రత్యేక ప్రతినిధి, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ భాషా, సాంస్కృతిక శాఖ, సిలికానాంధ్ర సంయుక్తంగా చేపట్టిన 'అంతర్జాతీయ నాట్య సమ్మేళనం' నగర వాసులను అమితంగా ఆకట్టుకుంటోంది. మూడురోజుల పాటు (డిసెంబరు 23,24,25ల్లో) కొనసాగుతున్న ఈ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఖండాంతరాల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను విస్తరించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతోందని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. నాట్య సమ్మేళనానికి సహాయసహకారాలు అందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



## భారీగా రానున్న రూ. 500 నోట్లు

**నాసిక్ :** పెద్దనోట్ల రద్దు తర్వాత కరెన్సీ ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం, వచ్చినవి కూడా చాలావరకు 2వేల రూపాయల నోట్లు కావడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఊరటగా.. కొత్త 500 రూపాయల నోట్లు భారీ సంఖ్యలో అందుబాటులోకి రానున్నాయి.



నాసిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్‌లో 500 నోట్ల ముద్రణను మూడు రెట్లు పెంచారు. గతంలో రోజుకు 35 లక్షల నోట్లను మాత్రమే ముద్రించేవాళ్లమని, ఇప్పుడు రోజుకు కోటి నోట్లను ముద్రిస్తున్నామని ప్రెస్ వర్గాలు తెలిపాయి. వాటితో పాటు మరో 90 లక్షల వేర్వేరు నోట్లు కూడా ముద్రిస్తున్నామని, రోజుకు మొత్తం 1.90 కోట్ల నోట్లు నాసిక్ ప్రెస్ నుంచి వస్తున్నాయని వివరించారు. వాటిలో 100, 50, 20 రూపాయల నోట్లు కూడా ఉన్నాయి. కొత్త 2వేల రూపాయల నోట్లను మాత్రం ఇక్కడ ముద్రించడం లేదు.

శుక్రవారం నాడు మొత్తం 4.30 కోట్ల నోట్లను రిజర్వు బ్యాంకుకు పంపారు. వాటిలో 1.1 కోట్ల 500 రూపాయల నోట్లు, 1.2 కోట్ల 100 రూపాయల నోట్లు, కోటి చొప్పున 50, 20 రూపాయల నోట్లు ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత ఇంత పెద్ద మొత్తంలో రిజర్వు బ్యాంకుకు కొత్త నోట్లు అందడం ఇదే మొదటిసారి. తొలిసారిగా నవంబర్ 11వ తేదీన ఇక్కడి నుంచి కేవలం 50 లక్షల 500 రూపాయల నోట్లను మాత్రమే పంపారు. గత 43 రోజుల్లో నాసిక్ ప్రెస్ నుంచి మొత్తం 82.8 కోట్ల నోట్లు రిజర్వు బ్యాంకుకు చెందిన వివిధ కార్యాలయాలకు చేరాయి. వీటిలో 25 కోట్ల నోట్లు 500 రూపాయలవి. గత మూడు రోజుల్లో 8.3 కోట్ల నోట్లు పంపిణీ చేయగా, వాటిలో 3.75 కోట్ల నోట్లు 500 రూపాయలవి. జనవరి 31 నాటికి మరో 80 కోట్ల కరెన్సీ నోట్లు ముద్రించి పంపగలమని నాసిక్ ప్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వాటిలో సగం వరకు కొత్త 500 రూపాయల నోట్లు ఉంటాయి. దేశంలో మొత్తం నాలుగు మాత్రమే కరెన్సీ నోట్ ముద్రణ ప్రెస్‌లు ఉన్నాయి. వాటిలో రెండు మైసూరులోని రిజర్వు బ్యాంకు వద్ద ఉండగా, మరొకటి బెంగాల్‌లోని సల్బోని వద్ద, ఇంకోటి నాసిక్‌లోను ఉన్నాయి. ప్రస్తుతం నాసిక్ ప్రెస్‌లో ఆదివారాలు కూడా సెలవులు ఇవ్వడం లేదు. సిబ్బంది లంచ్, డిన్నర్ బ్రేక్‌లు కూడా తీసుకోవడంలేదు. అంతేకాదు, సిబ్బంది పని వేళలను కూడా రోజుకు 11 గంటలకు పెంచారు.

## షిర్డీలో రాత్రిళ్లూ తెరవనున్న మందిరం



**షిర్డీ:** ఈ నెల 24, 31వ తేదీల్లో షిర్డీలోని సాయిబాబా మందిరాన్ని తెల్లవార్లూ తెరిచే ఉంచనున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా భారీగా భక్తులు వచ్చే అవకాశమున్నందున రాత్రిళ్లు కూడా ఆలయాన్ని తెరిచే ఉంచాలని నిర్ణయించినట్లు షిర్డీ సాయిబాబా సంస్థాన్ తాత్కాలిక ఎగ్జిక్యూటివ్ అధికారి కుందన్ కుమార్ సోనావానే తెలిపారు. షిర్డీకి వెళ్లే భక్తుల్లో ఎక్కువ మంది రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. ఈ ఆలయానికి ఎక్కువ ఆదాయం తెలుగు భక్తుల నుంచే వస్తుంది.

# నగదు రహిత లావాదేవీలా?



**రాజధాని ప్రతినిధి, అమరావతి :**

రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల కుటుంబాలన్నీ దాదాపుగా హైదరాబాద్‌లోనే ఉన్నాయి. విద్యా ఏడాది సగంలో తరలిరావడంతో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ ఐదురోజుల పనిదినాలను కల్పించడంతో శుక్రవారం సాయంత్రమే సచివాలయం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటికే రెండు కుటుంబాలకు ఖర్చు పెట్టవలసి వస్తోందని వారు వాపోతున్న విషయం తెలిసిందే.. ఈ పరిస్థితుల్లో నోట్ల రద్దు శరాఘాతంగా మారింది. దీనిని నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. దేశంలోనే హైటెక్ ముఖ్యమంత్రిగా పేరుగాంచిన చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని నగదురహితంగా చేయడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారోనని, ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. నగదుకొరత కారణంగా నగదురహిత లావాదేవీలు జరపాలని ఐఏఎస్‌లకు క్లాసులిచ్చిన ముఖ్యమంత్రి సచివాలయ ఉద్యోగుల కోసం బస్సుల్లో, లేదా క్యాంటీన్లలో పాయింట్ ఆఫ్ సేల్ పోస్ యంత్రాలు ఎందుకు సమకూర్చ లేదో తెలియడం లేదు. డిసెంబరు 1న పదివేలకోసం సచివాలయ ఉద్యోగులంతా భారీ క్యూలో నిలబడిన విషయం తెలిసిందే.. ఏటియంల్లో రెండు వేల నోటు కోసం కూడా ఇదే పరిస్థితి అయితే ఆ తర్వాతి రోజుల్లో ఏటీఎంల్లో డబ్బులు పెట్టడం మానేశారు. దీంతో ఎప్పుడు చూసినా నో క్యాష్ బోర్డులే కనిపిస్తున్నాయి. మళ్లీ ఆ రూ. 2000 చిల్లర కోసం దునియా మొత్తం తిరగాల్సి వస్తోంది. కొంతమంది సచివాలయ ఉద్యోగులు రెండువేలకు బదులు 1900 డ్రా చేస్తే మాత్రం అన్నీ వందల నోట్లే వచ్చాయి కాని త్వరగా నోట్లు నిండుకొని ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పుష్కరాలను సమీక్షించిన ముఖ్యమంత్రి పోస్ యంత్రాలను ఏర్పాటు చేస్తే సచివాలయ ఉద్యోగులకు వెలుసుబాటుగా ఉంటుందని భావిస్తున్నారు.

అసలే కొత్త రాష్ట్రం, అందునా చంద్రబాబు ముఖ్యమంత్రిగా సమయమంతా సమీక్షా సమావేశాలతోనే సరిపోతుందని ఉన్నతాధికారులు వాపోతున్నారు. ఇది చాలదన్నట్లు నోట్లరద్దుతో కొత్తపాట్లు వచ్చాయంటున్నారు. ముఖ్యమంత్రి మీలో ఎంతమంది నగదురహిత లావాదేవీలు జరుపుతున్నారంటూ ప్రశ్నించడం, కేవలం పదిమంది చేతులెత్తడంతో, ఎందుకు లావాదేవీలు జరపడంలేదని క్లాసు తీసుకోవడంతో అధికారుల పరిస్థితి మరింత దిగజారింది. ఉన్నతాధికారులంతా ప్రజలకు నగదురహిత లావాదేవీలపై అవగాహనా సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో అసలు పనులు పేరుకు పోతున్నాయని వారు వాపోతున్నారు. అయినా చిన్ననోట్లు లేకుండా ఎన్ని అవగాహనా సదస్సులు పెట్టినా ఏంటి లాభం ? అని అధికారులు అసహనానికి లోనవుతున్నారు.

# రాజధాని వార్తలు

కలం

## కుక్కతోక పట్టుకొని...

ఇప్పుడంటే ఈ సామెత ఎవరికీ తెలియదుకాని, ఒకప్పుడు కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్టు ఉంది అనే సామెత చాలా ప్రాచూర్య పొందింది. ఇప్పుడది ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీని పట్టుకొని ఈ కొత్త రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించాలనుకోవడం ఒట్టి భ్రమే ... బీజేపీ అధికార రాష్ట్రాల్లో అసహనం, దళితులపై దాడులతో పాటు దేశం అంతటా నోట్లరద్దుతో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర పరిస్థితులు, మిత్రపక్షమైన తెలుగుదేశం మీద కూడా పడుతుందేమోనన్న భయం తెలుగుదేశాన్ని వణికిస్తోంది. మొదట నోట్లరద్దు తన ఘనతగా చెప్పుకున్న చంద్రబాబు ఆపై ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహాలతో మాటమార్చారు. నల్లధనం వెలికితీతకు నోట్లరద్దు మంచిదే కాని, అమలు మాత్రం బాగోలేదని ముక్తాయింపు నిస్తున్నారు. మరో రెండేళ్లలో ఎన్నికలకు సిద్ధం కావాల్సి ఉండగా, ప్రజలు పనులు మానుకొని, ఇల్లు , పిల్లల్ని వదిలి తమ కష్టార్జితం కోసం బ్యాంకుల ముందు పడిగాపులు పడుతుండటంతో కంగుతిన్న మంత్రులు, ఎమ్మెల్యేలు ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పరిస్థితి ఏంటని చంద్రబాబు ముందు వాపోయారట. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ బీజేపీతో అంటకాగినందుకు రాష్ట్రానికి తెచ్చిన ప్రత్యేక నిధులు కూడా ఏమీ లేవు.

ఎన్నికల ప్రచారంలో మాత్రం కేంద్రంలోను, రాష్ట్రంలోనూ వచ్చేది మిత్ర పక్షమే కాబట్టి నవ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించడం సులువని, అంతేకాకుండా హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా చేసిన అనుభవం కూడా తనకుందని చెప్పారు. దీంతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోరిన ప్రజలంతా చంద్రబాబుకు ఓటేశారు. రాజధాని ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని చెంబుడు గంగ నీళ్ళు, పార్లమెంటు మట్టి తీసుకురావడంతో రాష్ట్ర ప్రజలంతా బిత్తరపోయారు. ఇక ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, సమాచార పౌరసంబంధాల మంత్రి వెంకయ్య నాయుడులు ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్ కోసం మేమే పాటుపడ్డాం అని ఊరూరా చాటి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మొహాలు చాటేసారు. ప్రత్యేక రాష్ట్రం కుదరదని, ప్రత్యేకప్యాకేజీకి నీతి అయోగ్ అనుమతించడంలేదని కుండబద్దలు కొట్టారు. దీంతో ప్రజలంతా వారిపై ఏహ్యాభావన పెంచుకున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ పని మరీ దారుణంగా తయారైంది. కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తేలేని ఎంపీలు, కేంద్ర మంత్రులు. ఈ పరిస్థితుల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్‌తో కలుద్దామన్న కుదరని పరిస్థితి చంద్రబాబుది. ఎందుకంటే వైఎస్ రాజశేఖర రెడ్డి చనిపోయిన తర్వాత కాంగ్రెస్‌తో జతకట్టి జగన్‌పై కక్షతీర్చు కున్నారని విపక్షాలు ఆరోపిస్తునే ఉన్నాయి. టెలికం, బొగ్గు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్యాయపు రాష్ట్ర విభజనతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎదురుగాలి వీస్తుందని గుర్తించిన చంద్రబాబు, 2014 ఎన్నికల్లో బీజేపీకి దగ్గరయ్యారు. అయినా సాధించింది ఏమీ లేదు. లక్షకోట్లు ఇచ్చామని బీజేపీ బుకాయిస్తుండగా, రూ. 17 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. నిజానిజాలు నిగ్గు తేల్చే ప్రయత్నం నాయకులు చేయడం లేదు. నాయకుల మెతక వైఖరి కారణంగా రాష్ట్రం పట్ల కేంద్రం మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి వైసీపీలోకి చేరిన ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు కేంద్రానికి లెక్కలు చెప్పక పోవడంతో దొంగను చూసినట్లు చూస్తోందన్నారు.

శకునాలు చెప్పే బల్లి కుడితి తొట్టిలో పడినట్లయింది, రాష్ట్రంలో తెలుగుదేశం పరిస్థితి. అసలే లోటు బడ్జెట్‌తో విడిపోయిన రాష్ట్రంలో కేంద్రం ఇమ్మడిముబ్బడిగా నిధులు ఇస్తుందనుకుంటే వస్తు సేవా పన్నులు (జీఎస్టీ) అమలుతో రాష్ట్రాలకు నిధులు లేకుండా చేస్తోంది. జాతీయ రహదారులపై మద్యం దుకాణాలు నిషేధించాలని తాజాగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎక్సైజ్‌కు నష్టం... పెద్దనోట్ల రద్దుతో అన్ని రాష్ట్రాల ఖజానాలు ఖాళీ అయ్యాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చంద్రబాబునాయుడు పెద్దనోట్ల రద్దు మంచిదే కాని అమలు సరిగాలేదు, అనగానే ఆ వార్త ఢిల్లీ దాకా వెళ్లింది. దీంతో బీజేపీ అధికార ప్రతినిధి, కార్యదర్శి సిద్ధార్థ సింగ్ ముఖ్యమంత్రికి ఫోన్ చేసి వివరణ అడగటంతో ముఖ్యమంత్రి పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో కేంద్రంపై తాను స్పందించకుండా పవన్‌కల్యాణ్‌తో ట్వట్టర్ల ద్వారా ప్రశ్నలు వేయిస్తున్నారని బీజేపీ అనుమానిస్తోంది...

## నోట్ల రద్దు ప్రజాదోపిడి

### ఫోర్బ్స్ పత్రిక సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నవంబరు 8వ తేదీన పెద్ద నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న ఆకస్మిక నిర్ణయంపై ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అనైతికమని, ప్రజల సొత్తును దోచుకోవడమేనని తీవ్రంగా ధ్వజమెత్తింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం తీసుకున్న దిగ్భ్రాందికర చర్య గా పేర్కొంది. ప్రజల ఆస్తులనుభారీగా దొంగిలించడమేనని ఫోర్బ్ విమర్శించింది. 1975-77 లో ఎమర్జన్సీ కాలంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేపట్టిన బలవంతపు కుటుంబ నియంత్రణ కార్యక్రమంతో ఈ నిర్ణయాన్ని పోల్చింది. పెద్ద నోట్లు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం భారతదేశం ఆర్థికవ్యవస్థను, భవిష్యత్ పెట్టుబడులను దెబ్బతీసిందని ఫోర్బ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ స్టీవ్ ఫోర్బ్స్ పేర్కొన్నారు. కరెన్సీ రద్దు చేయడం అంటే సామాన్యుడి గోప్యతపై దాడిచేయడమన్నారు. ప్రభుత్వం చర్య ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా కోట్లాదిమంది పేదల్ని మరింత భయాందోళల్లోకి నెట్టివేసిందనీ, ఇది అనైతికమని పేర్కొన్నారు. కరెన్సీ రద్దు చేసినంత మాత్రాన టెర్రరిస్టులు తమ దుర్మార్గపు పనులను వదిలి పెట్టరని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛామార్కెట్లకు అనుమతి ఉంటేనే నోట్ల రద్దు సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఎలాంటి ముందుస్తు హెచ్చరికలు లేకుండా 85 శాతం చలామణీలో ఉన్న నోట్లను రద్దు చేసి, సామాన్య ప్రజానీకాన్ని అత్యంత ఇబ్బందుల్లోకి నెట్టివేసిందన్నారు. తాజా ఆగ్రహం వ్యక్తం చేసింది చట్టబద్ధమైన వ్యాపారాన్ని సులభతరం చేసి వ్యాపార అవకాశాలను మరింత అందుబాటులోకి తేవాలన్నారు. మొత్తం పన్నుల మరింత తగ్గించాలని మ్యాగజైన్ సూచించింది. పన్నుల ఎగవేతకు పరిష్కారంగా ఎంత తక్కువ పన్ను రేటు ఉంటే అంతమంచిదని తెలిపింది. దేశీయ కరెన్సీని మరింత బలోపేతం చేయాలని కోరింది.




## నేహాభారతి, సాయి కుమార్‌ల వివాహమహోత్సవం









కాళ్లకూరి రవిసీతారాం,హేమలతల కుమార్తె నేహాభారతిని, సిద్ధా సుధాకర్, అఖిలల కనిష్ట కుమారుడు సాయి కుమార్‌కు ఇచ్చి డిసెంబరు 24వ తేదిన ఉదయం 9.10 గం॥ హైదరాబాద్‌లోని వోర్ల లక్ష్మారెడ్డి గార్డెన్‌లో వివాహం వైభవంగా జరిగింది.

# అసమర్థ కంపెనీలతో నవ్యాంధ్ర రాజధాని సాధ్యమా ?



నవ్యాంధ్రప్రదేశ్‌లో అమరావతి నిర్మాణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కలల నగరం. దీంతో చరిత్రలో నిలిచిపోదామని ఆయన ఎంతగానో పరితపిస్తున్నారు. రాజధాని నిర్మాణంకోసం ఏర్పాటైన శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను కాదని, మూడు పంటలు పండే అమరావతి ప్రాంతంలో రాజధాని ఏర్పాటుకు నడుంబిగించారు. ఇందుకోసం సింగపూర్, దక్షిణ కొరియా, ఇజ్రాయేల్‌లను ఆదర్శంగా తీసుకొని అనేక కార్యక్రమాలను నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది.

సింగపూర్ మోజులో ఉన్న చంద్రబాబు నాయుడు మొదట అమరావతి నగర నిర్మాణంలో పాలు పంచుకోవాల్సిందిగా ఆ దేశ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అయితే సింగపూర్ ప్రభుత్వం నేరుగా ఈ నగర నిర్మాణంలో పాలు పంచుకోవడానికి ఏ మాత్రం ఇష్ట పడ లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పరిస్థితులు, న్యాయపరమైన చిక్కులతో పాటు ఈ ప్రాజెక్టు లాభదాయకతపై కూడా సింగపూర్ ప్రభుత్వానికి అనుమానాలు ఉన్నాయి. ఇదే విషయాన్ని సింగపూర్ ప్రధాన మంత్రి లీషన్ లూంగ్ అక్టోబర్ 6న ఒక భారతీయ పత్రిక ఇంటర్యూలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో విదేశీ పెట్టబడులకు భూ సేకరణ, కోర్టు వ్యాజ్యాలు, మితిమీరిన చట్ట నియంత్రణలు , రెడ్ టేపిజం అడ్డంకులుగా మారాయని విశ్లేషించారు. దీనికి తోడు అమరావతి నగర నిర్మాణం 2050 వ సంవత్సరానికి గానీ పూర్తికాదు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే నగర నిర్మాణం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని సింగపూర్ ప్రభుత్వం భావించింది. గతంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వేలాది కోట్ల రూపాయల వ్యయంతో ప్రారంభించిన జలయజ్ఞం పథకాలు, హైదరాబాద్ మెట్రో రైలు పథకం కూడా ప్రభుత్వాలు మారిన తర్వాత ఇబ్బందుల్లో పడ్డాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని సింగపూర్ ప్రభుత్వం నేరుగా నగర నిర్మాణ అభివృద్ధి పనుల్లో పాలుపంచుకోకుండా తమ దేశంలోని ప్రైవేట్ సంస్థలకు ఈ ప్రాజెక్టు కాంట్రాక్టు ఇప్పించడానికి ప్రయత్నించింది.

సింగపూర్ ప్రభుత్వం అమరావతి నగర నిర్మాణానికి ముందుకు రాకపోవడానికి మరో ముఖ్యమైన కారణం ఉంది. చైనా రాజధాని బీజింగ్‌కు 150 కిలో మీటర్ల దూరంలో తియాన్జిన్ ఎకోసిటి అనే నగర నిర్మాణంలో నేరుగా పాలుపంచుకున్న సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే చేతులు కాల్చుకుంది. ఈ నగరాన్ని 50-50 శాతం భాగస్వామ్యం ప్రాతిపదికన చైనా సింగపూర్ ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. అమరావతి నగరానికి మాస్టర్ ప్లానర్స్‌గా ఉన్న జురాంగ్ ఇంటర్నేషనల్ , సుర్బానా సంస్థలే తియాన్జిన్ నగరానికి కూడా మాస్టర్ ప్లానర్స్‌గా ఉండడం విశేషం.

సింగపూర్ - చైనా సంయుక్తంగా 2009 జులైలో ఈ నగర నిర్మాణాన్ని ప్రారంభిచాయి. 2020 నాటికి 30 చదరపు కిలో మీటర్ల పరిధిలో నగరాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. కాని ఈ ఏడు సంవత్సరాల్లో ఈ రెండు దేశాలు కేవలం నాలుగు చదరపు కిలో మీటర్ల పరిధిలోనే నగరాన్ని నిర్మించగలిగాయి. వచ్చే మూడేళ్ళలో మిగిలిన 26 చదరపు కిలోమీటర్ల పరిధిలో నగరాన్ని నిర్మించాల్సి ఉండగా అది మరో ఇరవై ఏళ్ళకు కూడా సాధ్యమయ్యేటట్లు కనిపించడం లేదు. ఈ నగర నిర్మాణానికి సుమారు 9.7 అమెరికన్ బిలియన్ డాలర్ల వ్యయం అంచనా వేయగా అది ఇప్పుడు 25 అమెరికన్ బిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనా ,సింగపూర్ ప్రభుత్వాలు కేవలం 30 చదరపు కిలో మీటర్ల పరిధిలో కొత్త నగరాన్ని నిర్మించడానికి ఏడు సంవత్సరాలుగా ఆపసోపాలు పడుతుంటే ఆ దేశాల్నే చంద్రబాబు నాయుడు తరచుగా గొప్పగా పొగుడుతుండటం కొసమెరుపు.

తియాన్జిన్ నగర నిర్మాణం కోసం సింగపూర్ - చైనా మంత్రులతో ప్రత్యేక కమిటీ వేశారు. తర్వాత అధికారుల స్థాయిలో ఆరు సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. యాభై శాతం సమాన వాటాలతో చైనా సింగపూర్‌లు "సైనో-సింగపూర్ తియాన్జిన్ ఇకో-సిటీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ డవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ "(ఎస్.ఎస్.టి.ఇ.సి.) అనే సంస్థను ఏర్పాటు చేసి నగర నిర్మాణాన్ని ప్రారంభించాయి. అవసరమైన నిధులు కూడా సమకూర్చాయి. అయినప్పటికి ఈ నగర నిర్మాణం నత్తనడకన సాగుతోంది. మూడున్నర లక్షల మంది నివశించాల్సిన ప్రాంతంలో ప్రస్తుతం పది వేల మంది మాత్రమే నివశిస్తున్నారు. వేయికిపైగా వ్యాపార సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించినప్పటికి 98 మాత్రమే నగరానికి వచ్చాయి. ఈ నగరం ద్వారా ఐదేళ్ళలో వస్తుందనుకున్న ఆదాయంలో 25 శాతం కూడా రాలేదని తియాన్జిన్ ఇకో సిటీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ డవలప్‌మెంట్ కంపెనీ మాజీ సి.ఇ.వో. తాంగ్‌యన్ చెప్పారు. ఈ నగరం ఒక వైఫల్యంగా మారడంతో గత నెల ఆయన ఉద్వాసనకు గురయ్యారు. ఇప్పుడు ఆయన స్థానంలో సింగపూర్‌కు చెందిన తే లిమ్‌హెంగ్ నియమితులయ్యారు. ఈ నగర వైఫల్యం ప్రస్ఫుటుంగా కనిపిస్తున్నప్పటికి సింగపూర్ మాస్టర్ డవలపర్స్ మాత్రం అమరావతిలో 56 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని , లక్షలాది కోట్లు రూపాయల పెట్టుబడులు వెల్లు వెత్తుతాయని , వందలాది వ్యాపార సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు చేపడతాయని చెబుతుండటం గమనార్హం.

రాష్ట్ర హైకోర్టు అభ్యంతరాలు చెప్పినప్పటికి అడ్డదారుల్లో స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో అమరావతి నగర నిర్మాణాన్ని సింగపూర్‌కు చెందిన అసెండాస్ - సింగ్‌బ్రిడ్జ్, సెంబ్‌కార్ప్ డెవలప్‌మెంట్ సంస్థలకు అప్పగించాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉంది. అయితే కేవలం 30 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో తియాన్జిన్ ఇకో నగరాన్ని నిర్మించడానికి చైనా, సింగపూర్ ప్రభుత్వాలే నానా తంటాలు పడుతుంటే అంతకన్నా దాదాపు ఏడు రెట్లు ఎక్కువైన అంటే 217 చదరపు కిలోమీటర్ల నగరాన్ని నిర్మించి అభివృద్ధి పర్చడం సింగపూర్ ప్రైవేట్ సంస్థలకు సాధ్యమవుతుందా ?

అమరావతి నగర నిర్మాణంలో పాలు పంచుకోవడానికి దానికి మాస్టర్ ప్లాన్ ఇచ్చిన జురాంగ్ ఇంటర్నేషనల్, సుర్బానా సంస్థలు మొదట ఆసక్తి చూపాయి. (గతంలో విశాఖలో ఒక చిన్న టౌన్‌షిప్‌ను నిర్మించలేక మధ్యలోనే కాంట్రాక్ట్‌ను వదులుకున్న ఘనత జురాంగ్ ఇంటర్నేషనల్ కంపెనీది) అయితే అనూహ్యంగా చంద్రబాబు మిత్రుడు, సింగపూర్ వాణిజ్య , పరిశ్రమల శాఖ మంత్రి అయిన ఎస్.ఈశ్వరన్ గత ఏడాది జులై 20 తేదీన తాను డైరక్టర్‌గా ఉన్న, తనకు ఆర్థిక ప్రయోజనాలు ఉన్న సెంబ్‌కార్ప్ డెవలప్‌మెంట్ అనే ప్రైవేట్ సంస్థతో పాటు అసెండాస్ - సింగ్‌బ్రిడ్జ్ అనే మరో ప్రైవేట్ కంపెనీ పేరును తెరపైకి తెచ్చారు. ఈశ్వరన్ 2013 జనవరి 13వ తేదీ నుంచి సెంబ్‌కార్ప్ డెవలప్‌మెంట్‌కు డైరక్టర్‌గా ఉంటున్నారు. వివిధ కాంట్రాక్టులు ఈ కంపెనీకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించడం డైరక్టర్‌గా ఆయన ప్రధాన కర్తవ్యం. ఆయన సలహా మేరకే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ సంస్థలతో స్విస్ చాలెంజ్ పద్ధతిని బిడ్‌లు దాఖలు చేయించింది. అమరావతి నగర నిర్మాణానికి బిడ్ దాఖలు చేసిన కంపెనీల్లో ఒకటైన సెంబ్‌కార్ప్‌పై గతంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. తాజాగా ఈ కంపెనీ బ్రెజిల్‌లో 12 డ్రిల్లింగ్ రిగ్గుల నిర్మాణ కాంట్రాక్ట్ పొందడానికి పెట్రోబ్రాస్ అధికారులకు 9.50 మిలియన్ అమెరికన్ డాలర్ల లంచం ఇచ్చి బ్రెజిల్ న్యాయస్థానంలో దోషిగా నిలబడింది. ఈ కుంభకోణం తర్వాత ఈ కంపెనీ షేర్ల విలువ బాగా పడిపోయింది. ఎస్.ఈశ్వరన్ సింగపూర్ మంత్రిగా ఉంటూ తాను డైరక్టర్‌గా ఉన్న ఒక కళంకిత కంపెనీకి అయాచిత లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేశారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగపూర్ పేరుతో కళంకితమైన ఆ దేశ ప్రైవేట్ కంపెనీని అమరావతి నగర నిర్మాణానికి ఆహ్వానిస్తోంది. మరో ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే ఈ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌తో పాటు రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్ , తమిళనాడుల్లో విద్యుత్ కేంద్రాల్లో (3,340 మెగావాట్లు) పెట్టుబడులు పెట్టింది. అయితే దీనికి నగర నిర్మాణాల్లో తగినంత అనుభవంలేదు. ఇప్పటిదాకా అది 50 : 50 నిష్పత్తిలో వియత్నాం, చైనా, ఇండోనేషియాల్లో 10,257 హెక్టార్ల భూమిని మాత్రమే అభివృద్ధి చేసింది. మన రాష్ట్రంలో ఈ సంస్థ గాయత్రి ప్రాజెక్ట్స్, నాగార్జున కనస్ట్రక్షన్స్‌తో కలిసి విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తోంది. ఒకవేళ ఈ సింగపూర్ సంస్థకు అమరావతి నిర్మాణ ప్రాజెక్టు లభిస్తే అది ఖచ్చితంగా గాయత్రి, నాగార్జున కనస్ట్రక్షన్స్ లాంటి స్థానిక కంపెనీలకు సబ్ కాంట్రాక్ట్ ఇస్తుంది. ఈ కంపెనీలు ఇప్పటిదాకా నిరేశించిన గడువులో ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదు.

అమరావతి నగర నిర్మాణానికి బిడ్ దాఖలు చేసిన సంస్థల్లో మరొకటైన అసెండాస్ - సింగ్‌బ్రిడ్జ్ సంస్థ ఛైర్మన్ వాంగ్‌కాన్ సెంగ్ సింగపూర్ ప్రభుత్వంలో గతంలో డిప్యూటీ ప్రధాన మంత్రిగా పనిచేశారు. ఆయన 2011 నుంచి అసెండాస్ - సింగ్‌బ్రిడ్జ్ సంస్థ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ ఆయన సింగపూర్ ప్రభుత్వ సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు ఆయన మంచి మిత్రుడని, ఈ కంపెనీల్లో ఈశ్వరన్ కుటుంబానికి వాటాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఈ కంపెనీల నేపథ్యం, అమరావతి నగర నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అసమర్థ, కళంకిత కంపెనీలతో, తియాన్జిన్ నగరానికి పట్టిన గతే అమరావతి నగరానికి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉంది.

- వ్యాసకర్త
వి.వి.ఆర్. కృష్ణంరాజు
సెల్ - 950 529 2299

# రాష్ట్ర ప్రభుత్వానికి శరాఘాతం

- బార్ అండ్ రెస్టారెంట్ల నూతన పాలసీ నిలిపివేత
- 'సుప్రీం' మార్గదర్శకాలు పాటిస్తే రహదారులపై వేలాది మద్యం దుకాణాలు మూత

**రాజధాని ప్రతినిధి ,(అమరావతి) :** రాష్ట్ర రహదారుల్లో 500 మీటర్లు అంటే అర కిలోమీటరు లోపు వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు ఉండటానికి వీల్లేదనీ, ఇప్పటికే ఉన్న వాటిని వచ్చే ఏడాది. మార్చి 31 లోపు రద్దు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వటంతో ఏపీ ప్రభుత్వానికి నూతన పాలసీ అమలులో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మరో వారం రోజుల్లో బార్ రెస్టారెంట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధం చేసిన ఫైలు అటకెక్కినట్టేనని భావిస్తున్నారు. ఇప్పటికే ఉన్న వాటిని మరో మూడు నెలలపాటు రెన్యువల్ చేసి ఆ తరువాత నూతన పాలసీని రూపొందించి వైన్ షాపులతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లకు లైసెన్సులు ఇవ్వాలని భావిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో 4300 వైన్ షాపులుండగా,770 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 14 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నట్టు అంచనా, కొత్త పాలసీ ద్వారా ప్రభుత్వం మరో రెండు వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని పెంచుకోవటానికి రంగం సిద్ధం చేస్తుండగా సుప్రీం తీర్పు పిడుగులా పరిణమించింది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మద్యం మారటంతో సుప్రీం తీర్పు ప్రభుత్వ పెద్దలకు మింగుడు పడటం లేదు. పైగా బార్ అండ్ రెస్టారెంట్ల నూతన పాలసీని పూర్తిగా భారీ ఆదాయం సమకూర్చేలా రూపొందించిన నేపథ్యంలో వచ్చిన తీర్పుతో ఏమిచేయాలో పాలుపోవటం లేదు. గడిచిన రెండేళ్ళుగా బార్ల లైసెన్సులను రెన్యువల్ చేస్తున్నారు. వైన్ షాపుల లైసెన్సు కూడా వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తవుతుంది. అయితే, వైన్ షాపుల లైసెన్సులను కూడా మార్చి నెల వరకు మాత్రమే పరిమితం చేసి ఏప్రిల్ 1 నుంచి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తక్షణం బార్ లైసెన్సుల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇబ్బందికరంగా పరిణమించాయి. జాతీయ రహదరులపై అవి లేకుండా చూడటంలో పర్యవేక్షణ బాధ్యతలు ఆయా ప్రభుత్వాల చీఫ్ సెక్రటరీలు, డీజిపిలకు అప్పచెప్పటంతో సుప్రీంకోర్టు తీర్పును విధిగా పాటించక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి.

**50 శాతం రోడ్లపైనే ...**

సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వైన్ షాపులు, బార్లను ఏర్పాటుచేస్తే ఇపుడున్న మద్యం దుకాణాల్లో 50 శాతానికి పైగా రద్దవుతాయి. ప్రత్యేకించి పట్టణ, నగర ప్రాంతాల పరిమితిని చూపించి హైవేలపై యధేచ్ఛగా షాపులు నడుపుతున్నారు. వీటిని కూడా పరిగణలోకి తీసుకుంటే 70 నుంచి 80 శాతం మద్యం దుకాణాలు గల్లంతవుతాయి. గుంటూరు -1 ఏరియాలో 56 వైన్ షాపులుంటే అందులో 50 షాపుల రోడ్ల మీద ఉన్నాయి. ప్రకాశం జిల్లాలోనూ పరిస్థితి అలాగే ఉంది. అర్బన్ ఏరియాగా చూపించి హైవేలపై నడుస్తున్న మద్యం షాపులు రోడ్ల మీద ఉన్నాయి. ప్రకాశం జిల్లాలోనూ పరిస్థితి అలాగే ఉంది. అర్బన్ ఏరియాగా చూపించి హైవేలపై నడుస్తున్న మద్యం షాపులు సుమారు వంద వరకు ఉంటాయని అంచనా . ఇవి కాకుండా ప్రకాశం జిల్లాలోని మొత్తం 314 మద్యం దుకాణాల్లో 18 దుకాణాలు 16వ నంబరు జాతీయ రహదారిలో ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్నాయి. అటు నెల్లూరు, గుంటూరు జిల్లాల పరిధిలోని జాతీయ రహదారిపై అంతకు మించి మిక్కిలిగా ఉన్నాయి.

# అమలోద్భవి ఒడిలో లోకరక్షకుడు

ఆమె

గాబ్రియేలు దేవదూత నీకు కుమారుడు జన్మిస్తాడని మరియ తల్లికి చెప్పగానే ఎంతగానో కలవరపడ్డారు. అయితే లోకరక్షకుడు నీగర్భాన పుడతాడు అతనికి ఏసు అని పేరుపెట్టాలి అనగానే దేవదేవుని కుమారుడే తన గర్భాన జన్మించబోతున్నాడన్న ఆనందంతో ఎన్నో కలలు, మరెన్నో ఊహలు ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశాయి. బహుశ ఈ లోకాలను ఏలే ప్రభువు తన గర్భాన పుట్టడం ఎంత ఆధిక్యత అని మురిసిపోయి ఉంటారు. కరడుగట్టిన ఈ లోకాన ఎలా పెంచాలా అని మధనపడి కూడా ఉంటారు కదా !

హేరోదు రాజు జనాభా లెక్కలకోసం తన ప్రజలందరినీ పిలవడంతో నిండుచూలాలిని (ఆమె భర్త ) యేసేపు గాడిదపై ఎక్కించి బెత్లేహేము నగరానికి తీసుకువెళ్లారు. అక్కడి సత్రాలన్నీ ప్రయాణీకులతో నిండిపోవడంతో ఆమెపై జాలితో సత్రపు యజమాని పశువుల పాకలో ఉండటానికి అనుమతించారు. అక్కడే ఆమె లోకరక్షకుడికి జననం ఇచ్చింది. పశువులపాకలో దివ్యకాంతులు వెదజల్లాయి. మంచి మనస్సులు, మనుషులు ఎక్కడ ఉన్నా వారి సుగంధం, వెలుగులు ప్రసరిస్తూనే ఉంటాయనడానికి అదొక తార్కాణం. అయినా ఆయన కోసం ముగ్గురు పశువుల కాపరులు, ఇంకా ముగ్గురు జ్ఞానులు కూడా ఏతెంచి కానుకలు సమర్పించారు. ఎంత గొప్ప సంఘటన... ! సాదాసీదా పశువుల కాపరులకు దేవదూత లోకరక్షకుడు పుట్టాడని తెలియచేస్తే.. అరుదైన నక్షత్రం ఆకాశంలో పుట్టిందంటే ఎవరో మహామహనీయుడు ఈ లోకంలో పుట్టాడని జ్ఞానులు తమ విజ్ఞానంతో తెలుసుకున్నారు...



దేవదేవుడు సామాన్యులకు, విజ్ఞానులకు అందుబాటులో ఉంటాడని ఈ కార్యం ద్వారా అర్థమవుతుంది.

ఆయన పుట్టింది కూడా ఒక సాదాసీదా వడ్రంగి ఇంట... అంతేగాని ఆగర్భ శ్రీమంతుడి ఇంటకాదు. **ఎంత ఆనందంగా బ్రతికాము, ఎంతగా పరులకోసం పాటుపడ్డామన్నది ముఖ్యంకాని ఏ కులాన, ఏమతాన, ఎంత గొప్ప ఇంటిలో పుట్టాము అన్నది ముఖ్యం కాదన్నది తెలియడానికే దేవుడు తన కుమారుడిని ఇలా పంపాడని మనం అర్థం చేసుకోవాలి.** చిన్ననాటి నుంచి ఎంతో అణుకువగా,క్రమశిక్షణగా పెరిగిన ఏసు తన యుక్తవయస్సులో బోధనలు చేపట్టగానే తల్లి మరియ ఎంతగానో తల్లడిల్లి ఉంటుంది. ఎందుకంటే లోకరక్షకుడు అంటే కుళ్లు రాజకీయలను కడిగివేసి, దీనులకు, దీనాత్ములకు అనుదినం అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలను ఉద్దరించడానికి తన కుమారుడు రారాజుగా అవతరిస్తారని ఏసును గురించి ఊహించి ఉండవచ్చు. అయితే ఆయన దీనాత్మకలిగి, విరిగి నలిగిన హృదయం కలవారిని, దీనాత్ములను, కుంటి, గుడ్డివారిని, చెదిరిన మనస్సుతో అష్టకష్టాలు పడుతున్న వారిని తన ఓదార్పు మాటలతో ఉజ్జీవాన్ని నింపుతున్న తన కుమారుడిని చూసి తన కిష్టమైన మార్గాన్ని అనుసరించేందుకు ఆమె పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. తన మార్గంలో ఎదురయ్యే ప్రతి ఎదురుదెబ్బను భరించడానికి తన సాన్నిధ్యాన్ని, తన సహాయ సహకారాలను ఎల్లప్పుడు అందిస్తూనే ఉన్నారు. ఎంతవరకంటే ఆయన మరణం వరకు... ఆమె వెంట ఉన్నారు. అంతేకాని నామాటే వేదం .. నీవు రాజువు కావాలి.. ఇలాంటివి చేయకూడదు అని ఎప్పుడూ ఆమె ఏసు దారికి అడ్డురాలేదు.

– విజయమేరి

## తల్లిదండ్రుల బాధ్యతలు

ఈనాటి తల్లిదండ్రులు నువ్వు ఫలానా కోర్సే చేయాలి... రిజర్వు బ్యాంకులా ఎప్పుడూ నీదగ్గర కోట్లుండాలి. ఇలాంటి ఊహలతో పిల్లలను విద్యాలయాలనే కార్ఖానాలకు పంపుతున్నారు తప్ప విలువలు కలిగిన విద్యను అందించలేక పోతున్నారు. అందుకే ఒత్తిడి భరించలేక, తమకు ఇష్టంలేని విద్యను చదవలేక, అర్థాంతరంగా తమ జీవితాలను చాలిస్తున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు తమ బిడ్డల కలలను, ఆకాంక్షలను అర్థం చేసుకొని వారికి మార్గదర్శకులుగా నిలవాలి. అంతేకాదు జీవితంలో వారు ఒక స్థానానికి చేరేవరకు చేదోడు వాదోడుగా నిలవడానికి మేం నీకు ఉన్నాం.. అనే భరోసాను కల్పించాలి... ఏరంగంలో తమ బిడ్డలు ప్రవేశించినా ఉత్తమ విలువలు పాటించేలా చేయడం తల్లిదండ్రుల బాధ్యత.. అప్పుడే వారు ఉత్తమ సంతానాన్ని ఈ దేశానికి ఇవ్వగలరు... ఉత్తమోత్తమ తల్లిదండ్రులుగా లోకాన నిలుస్తారు.

## ప్రస్తుత స్థితి ఉర్జిత్ చలవే : పవన్



**హైదరాబాద్ :** నోట్ల రద్దు వల్ల నల్ల కుబేరులకు జరిగిన నష్టం ఏమీ లేదని, కేంద్ర సర్కార్ దయవల్ల బ్యాంకు ఉద్యోగులు నల్ల కుబేరుల జాబితాలో చేరారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కిలోమీటర్ల పొడవున క్యూలలో నిలబడలేక సామాన్యులు చనిపోతుంటే నల్ల కుబేరులు మాత్రం ఇంట్లోనే కూర్చుని కోట్లకు కోట్లు ఇంట్లోకి తెచ్చుకోలేదా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. నోట్ల ఉపసంహారణతో దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాలు, రోజు వారీ కూలీలు, గృహిణులు, చిరు వ్యాపారులపై ఎంత ప్రభావం పడిందో మీకు తెలుసా అని ట్విట్టర్ వేదికగా పవన్ కేంద్రాన్ని నిలదీశారు. పవన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. గత కొద్దిరోజులుగా ఒక్కో అంశంపై ట్వీట్ల వర్షం కురిపిస్తున్న పవన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. గత కొద్ది రోజులుగా ఒక్కో అంశంపై విరుచుకుపడ్డారు. గత కొద్దిరోజులుగా ఒక్కో అంశంపై ట్వీట్ల వర్షం కురిపిస్తున్న పవన్ నోట్ల రద్దుపై కేంద్రంపై ప్రశ్నలు సంధించారు. రద్దును ఒక ఫార్సుగా వర్ణిస్తూ, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా గవర్నర్ ఉర్జిత్ పటేల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మిస్టర్ ఉర్జిత్ ....ఎపిలోని కర్నూలుకు చెందిన బాలరాజు మీరు ఎంతో ఆలోచించి తీసుకొచ్చిన పెద్దనోట్ల రద్దు వల్ల ప్రాణాలు కోల్పోయిన ఎంతో మంది అభాగ్యుల్లో ఈయన ఒకరు. ఈయన మృతికి మీరే కారణమం' అంటూ జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నోట్ల రద్దుతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 60 ఏళ్ల తర్వాత కూడా మలమూత్రాలు చేతులతో ఎత్తే మన దేశంలో నగదు రహిత లావాదేవీలు సాధ్యమేనా అని ప్రశ్నించారు. '86 శాతం నగదు బ్యాంకుల్లో డిపాజిట్ కావడంతో ఉర్జిత్ పటేల్ ఇప్పుడు ఆనందంతో గంతులు వేస్తుండవచ్చు.. నల్లధనం తుడిచిపెట్టుకుపోయిందని గర్వంగా చెప్పుకుంటుండొచ్చు, కానీ నిజమేమిటంటే మీరు పాత దానిని కొత్త దానితో మార్చారు. ఇక దోపిడీ దారులు వర్గంలో బ్యాంకింగ్ ఉద్యోగులు కూడా చేరిపోయారు' అంటూ ట్వీట్ చేశారు. నోట్ల రద్దుపై నేడు చర్చించిన అంశాలు తనకు సంతృప్తి నివ్వలేదని, ఈ సమస్యలపై తన ఆలోచనలు విస్తృతంగా పంచుకోవాల్సిన అవసరం ఉందని పవన్ అన్నారు.

## నోట్ల రద్దుతో తిరిగి బార్టర్ విధానం

**కేంద్రపరా (ఒడిశా) :** పెద్దనోట్ల రద్దుతో వ్యవసాయ రంగం కుదేలైంది. పంట చేతికొచ్చే సమయంలో డబ్బు లేక రైతులు విలవిల్లాడుతున్నారు. అయితే, ఈ సమస్య నుంచి బయటపడేందుకు ఒడిశాలోని కోస్తా జిల్లా రైతులు బార్టర్ (వస్తుమార్పిడి) విధానాన్ని పునరుద్ధరించారు. వరికోతల సమయం సమీపించడంతో పురాతనకాలం నాటి బదాలియా (బదిలీ) విధానమంటే వ్యవసాయ కార్మికుల సేవలను పరస్పరం మార్చుకోవడం. ఒడిశాలోని కొన్ని జిల్లాల్లో ఈ విధానం అమలు చేయాలని రైతులు నిర్ణయం తీసుకున్నారు. నోట్ల రద్దు తర్వాత పరిస్థితిని అధికమించడానికి జుగల్ కిషోర్ లెంకా వంటి చిన్న, మధ్యతరగతి రైతులు సహకార రైతులతో కలసి ఈ విధానం అమలు చేయడానికి ముందుకు వచ్చారు. జగత్‌సింగ్‌పూర్ జిల్లా గోడా గ్రామానికి చెందిన 45 ఏళ్ల జుగల్ కిషోర్ లెంకా, సుదం సాహూ ఈ విధంగా వ్యవసాయ కార్మికులతో వరి నూర్పిళ్లు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. 'తర్వలో వ్యవసాయ నూర్పిళ్ల ప్రారంభిస్తున్నాం. నోట్ల సంక్షోభం వల్ల నూర్పిళ్లకు వ్యవసాయ కార్మికులను వినియోగించే పరిస్థితి కనిపించడం లేదు. మా గ్రామానికి చెందిన సాహూ కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాడు. మా ఇద్దరికీ నలుగురు కార్మికులు ఉన్నారు. ముందు మా చేలో పనిచేస్తాం. అదే కార్మికులతో తర్వాత సాహూ చేలోపనిచేస్తాం. వరి కోత, నూర్పిళ్లు సజావుగా జరగడానికి మేము కార్మికులను మార్పిడి చేసుకుంటున్నాం' అని లెంకా వివరించారు. లెంకాకు కేవలం అర ఎకరం మాత్రమే వ్యవసాయ భూమి ఉన్నది. బదిలీ విధానాన్ని వ్యవసాయ కార్మికులకూ వర్తింప చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీనంతటికీ కారణం పెద్దనోట్ల రద్దే. బదిలీ విధానం వల్ల వ్యవసాయ కార్మికులకు వేతనాలు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. దీనిని బార్టర్ ఆఫ్ లేబర్ (కార్మికుల మార్పిడి) విధానం అంటారు. పూర్వకాలంలో ఉండేది. వ్యవసాయ కార్మికుల కొరత ఉన్న కాలంలో రైతులు ఈ విధానం అమలు చేశారని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టరు ప్రఫుల్లా మిశ్రా చెప్పారు. ఈ విధానం ఇప్పుడే ఆరంభమవుతుందని, క్రమేణా ఊపందుకుంటుందని ఆయన వివరించారు. వ్యవసాయ కార్మికుల సంక్షోభం తీవ్రతరం కావడంతో కార్మికుల మార్పిడి ప్రక్రియ కొన్ని ప్రాంతాల్లో మెల్లగా ఊపందుకునే అవకాశం ఉందని వెల్లడించారు. కోస్తా జిల్లాల్లో వ్యవసాయ కార్మికులకు కూలి చెల్లించే పరిస్థితి లేనందున ఈ ప్రత్యామ్నాయ విధానం అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ విధానం అమలు చేయాలని రైతులు నిర్ణయించుకున్నట్టు కొన్ని ప్రాంతాల నుంచి తమకు సమాచారం అందుతోందని మిశ్రా పేర్కొన్నారు.

## పాత నోట్లతో పీఎంజీకేవై పన్ను చెల్లింపులు

ప్రభుత్వం అనుమతి



**న్యూఢిల్లీ :** పన్ను ఎగవేత క్షమాభిక్ష పథకం క్రింద లెక్కలు చూపని నగదు నిల్వలపై పన్ను చెల్లింపు కోసం డిసెంబరు 30 వరకు రద్దయిన రూ.500, రూ,1000 పాత నోట్లను అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. నంవంబరు 8న పాత పెద్ద నోట్లను జమ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. లెక్కలు చూపని నగదుకు పునాల్టీ, సర్‌చార్జి, పన్నుగా 50 శాతం చెల్లింపులకు అవకావం ఇచ్చింది. అయితే నాలుగేళ్ల కాలానికి వడ్డీ రమిత డిపాజిట్లలో 25 శాతం అదనంగా పన్ను ఉంటుంది. 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకేవై)–2016 క్రింద డిపాజిట్లు, సర్‌చార్జి/సెస్, పెనాల్టీ, పన్ను దిశగా చెల్లింపులు చేపట్టేందుకు ఇదొక అవకాశం డిసెంబరు 30, 2016 వరకు పాత రూ.500, రూ.1,000 నోట్లను చెల్లించవచ్చు' అని అధికార ప్రకటన, తెలిపింది. ఈ మేరకు నిబంధనను ఆ అధికారి వివరిస్తూ, 29 జాతీయ బ్యాంకులు వేటిలోనైనా లెక్కలు చూపని నగదులో సగాన్ని డిపాజిట్ చేయవచ్చు. మిగిలిన నాల్గవ వంతు మొత్తాన్ని వడ్డీ రహిత పీఎంజీవైకే పథకంలో, మిగిలిన 25 శాతాన్ని వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసే అవకాశం ఉంది. ఇక డిసెంబరు 30 తర్వాత, చెక్కు లేదా ఆర్‌టీజీఎస్ బదిలీ ద్వారా డిపాజిట్‌తోపాటు పన్ను ఉంటుంది. తర్వాత ఇక జాతీయ బ్యాంకు పాత నోట్లను అంగీకరించిందని వివరించింది. ఇదిలాఉండగా ఇప్పటికే 3 పన్నునోటీసులను జారీ చేయగా డిసెంబరు 30 గడువు ముగిసిన తర్వాత వచ్చే నెలలో మరిన్ని నోటీసులు జారీ చేయనుంది. అయితే తమ ఆదాయాలకు, బ్యాంకు ఖాతాల్లోని మొత్తాలకు సరిపోలనపుడు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. కాగా మార్చి 31న క్షమాభిక్ష పథకం ముగియనున్నది. లెక్కలు చూపని నగదుపై పన్ను రేటు 30 శాతంగా ఉండగా సర్‌చార్జి 33 శాతం, 10 శాతం పునాల్టీ విధించింది. ఏ మందిపు సంవత్సరానికైనా ఆదాయ పన్ను క్రింద ఖాతాదారు మొత్తం ఆదాయంలో ఈ పథకం క్రింద ఆదాయ వెల్లడి వర్తించదు. ఈ పథకం క్రింద నల్లధనం వెల్లడించకపోతే పన్నులు, పునాల్టీలో 77.25 శాతానికిలెవీ విధిస్తారు. రిటర్న్‌లో లేదా పథకాన్ని వినియోగించుకోని కేసుల్లో విచారణ సమయంలో పన్నుపై 10 శాతం పెనాల్టీ విధించబడుతుందని ఆ అధికారి పేర్కొన్నారు.

## 'కండక్టర్లను తగ్గించే ప్రక్రియ రద్దు చేయాలి'

**రాజధాని ప్రతినిధి–అమరావతి :** ఏపీఎస్‌ఆర్టీసీలో కండక్టర్ల సంఖ్యను తగ్గించే విధానాలను రద్దు చేయాలని కార్మిక పరిషత్ డిమాండ్ చేసింది. ఆ సంఘం ప్రధానకార్యదర్శి వి.వరహాలనాయుడు ఆర్టీసీ ఎండీ మాలకొండయ్యను విజయవాడలో కలిసి డ్రైవర్‌కే కండక్టర్ బాధ్యతలు అప్పగిస్తుండటపై అభ్యంతరం తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న సీసీఎస్‌కు ఆర్టీసీ యాజమాన్యం రూ.75 కోట్లు బకాయి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) డిమాండ్ చేసింది.

## ప్రపంచ కిరీటం ప్యూర్టోరికో సుందరికే

- కరిబియన్ దీవులకు రెండో అవకాశం
- 1975లో ఈ దీవికి తొలిసారి దక్కిన కిరీటం

**మేరీల్యాండ్ (యుఎస్) :** అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఆదివారం జరిగిన 66వ మిస్‌వరల్డ్ – 2016 ఫైనల్స్‌లో ప్యూర్టోరికోకి చెందిన స్టెఫానీ డెల్ వాల్లే విజేతగా నిలిచింది. రెండు, మూడు స్థానాలు డోమమినికన్ రిపబ్లిక్, ఇండోనేషియా సుందరులకు లభించాయి. భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన ప్రియదర్శిని ఛటర్జీ టాప్ 20ని దాటి ముందుకు వెళ్ళలేకపోయింది. మేరీల్యాండ్‌లోని ఎంజిఎం నేషనల్ హార్బన్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో స్టిఫానీకి మిస్ వరల్డ్ 2015 మిరియా లాలాగుణా రొయో కిరీటాన్ని తొడిగింది. పంతొమ్మిదేళ్ళ స్టెఫానీ ప్రపంచసుందరి టైటిల్ గెలుచుకున్న రెండవ ప్యూర్టోరికన్. 1975లో ఆ దేశానికి చెందిన విల్నెలియా మెర్సిడ్ తొలిసారి ఈ టైటిల్ సాధించింది. టాప్ 5లో కెన్యా, ఇండోనేసియా, డొమినికన్ రిపబ్లిక్, ఫిలిప్పీన్స్ సుందరులతో పోటీపడిన విజేతగా స్టెఫానీ తన పేరు ప్రకటించగానే ఉద్విగ్నతకు లోనయింది. అనంతరం మాట్లాడుతూ వినోద పరిశ్రమలో ప్రవేశించే ఆసక్తి తనకుందని ప్రకటించింది.

భారత్‌కు చెందిన ప్రియదర్శిని టాప్20 నుంచి ముందుకెళ్ళలేకపోయింది. 'బ్యూటీవిత్ పర్పస్' విభాగంలో టాప్ 5లో ఆమెకు స్థానం దక్కినప్పటికీ, ఆ టైటిల్‌ను మిస్ ఇండోనేసియా గెలుచుకుంది. గౌహతీకి చెందిన ప్రియదర్శిని ఈ పోటీల్లో పాల్గొన్న తొలి ఈశాన్య భారతీయురాలు. చివరిసారిగా ఈ టైటిల్‌ను సాధించిన భారతీయురాలు (2000లో) ప్రియాంక చోప్రా. అంతకుముందు రిటా ఫరియా



(1966), ఐశ్వర్యారాయ్ (1994), డయానాహెడెన్ (1977), యుక్తముఖి (1999) మిస్ వరల్డ్ టైటిల్ సాధించారు.

## మాయావతికి మనీ కష్టాలు!

### పుట్టిన రోజు వేడుకలు నిరాడంబరంగా జరపాలని నిర్ణయం

**న్యూఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దు ప్రభావం రాజకీయపార్టీ నేతలను వదలడం లేదు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బహుజన్ సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి పుట్టిన రోజూ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించారు. జనవరి 15న మాయవతి 61వ సంవత్సరంలోకి అడుగుపెడుతుండటంతో నగదు కొరత కారణంగా ఆర్భాటం లేకుండా నిర్వహించాలని కార్యకర్తలు సూచించారు. ప్రతీ ఏడాది బీఎస్పీ నేతలు మాయవతి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలు విరాళాలు సేకరించి పెద్దపెద్ద కేకులను కట్ చేసి వైభవంగా నిర్వహించేవారు. అయితే ఈసారి పుట్టిన రోజు వేడుకలకు ఖర్చుచేసే నగదును పార్టీ ఎన్నికల ఖర్చుకోసం వాడాలని నిర్ణయి



ంచారు. అయితే ప్రతీసారి మాదిరిగా ఏ ఆమె పుట్టినరోజు సందర్భంగా పార్టీ నేతలను కార్యకర్తలను కలుసుకుంటారని, కానీ వేడుకలు మాత్రం ఎలాంటి ఆర్భాటం లేకుండా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. వచ్చే ఏడాది. యూపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది చివరిలోపు ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తున్నందున పుట్టిన రోజు వేడుకలను సాదాసీధాగా నిర్వహించనున్నట్టు పార్టీ సీనియర్ నేత రామంచల్ రాజ్బహర్ తెలిపారు. అయితే ఆమె అధినేత్రి పుట్టిన రోజు సందర్భంగా ప్రతీ కార్యకర్త పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసి అధికారంలోకి తీసుకు వస్తామని ప్రతిజ్ఞ చేయనున్నట్టు చెప్పారు. కాగా మాయవతి తన 60వ పుట్టిన రోజు వేడుకలను కూడా సామాన్య ప్రజల్లాగే సాదాసీదాగానే నిర్వహించాలని సూచించారు. అయినప్పటికి కార్యకర్తలు వేడుకలు భారీ ఎత్తున నిర్వహించడంతో విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. మరోవైపు 2010లో ఆమె ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పార్టీ నేతల నుంచి పుట్టిన రోజు కానుకగా రూ. 25 కోట్లు తీసుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ సారి వేడుకలు ఎలాంటి ఆర్భాటం లేకుండా నిర్వమించేందుకు పార్టీనేతలు సమాయత్తం అవుతున్నారు.

## పెళ్లయిన మహిళలే ఉద్యోగాలకు వెళుతున్నారు

**న్యూఢిల్లీ :** పెళ్లికాని మహిళలతో పోల్చుకుంటే పెళ్లయినవారే ఎక్కువమంది ఉద్యోగాలకు వెళుతున్నారు. వీరే తక్కువమంది పిల్లలు కావాలని కోరుకుంటున్నారు. 2011 జనాభా లెక్కలను ఇటీవల విడుదల చేశారు. దీన్లో 41శాతం వివాహితులు ఉద్యోగాలకు వెళుతున్నారనీ, పెళ్లికాని వారి శాతం 27గా ఉందని తేలింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే గ్రామాల్లో ఉన్న మహిళలో సగం మంది ఉద్యోగాలకు వెళుతుంటే, పట్టణాల్లో ఈశాతం 22గా ఉంది. గ్రామాల్లో ఉన్న వివాహితులతో పోల్చుకుంటే పట్టణప్రాంతాల్లో సంతానోత్పత్తి రేటు గణనీయంగా పడిపోయింది. ఉద్యోగాలు చేయని వారిలో సంతానోత్పత్తి శాతం అత్యధికంగా 3.1కి చేరుకుంది. పిల్లలు పుట్టే లింగనిష్పత్తి గత సంవత్సనం పడిపోయింది. ఉద్యోగాలు చేసే వివాహితులకు 2001లో 1000 మంది మగపిల్లలు ఉంటే, 912 మంది ఆడపిల్లలు ఉన్నారు. 2001లో 1000 మంది మగపిల్లలు ఉంటే 901 మంది ఆడపిల్లలు ఉన్నారు. ఆరు నెలలు కన్నా తక్కువ కాలం ఉద్యోగం చేసే మానేసిన వివాహితుల్లో సంతానోత్పత్తి రేటు అధికంగా 3.4గా ఉంది. ఇది పదేళ్ల క్రింతం 3.7గా ఉంది.

## సర్వీస్‌లో మృతి చెందితే...?

- పూర్తి సంపాదిక సెలవులు మంజూరు
- కుటుంబానికి అండగా జీవో నెంబర్ 234



**రాజధాని ప్రతినిధి గుంటూరు :** సర్వీసులో ఉండగా మృతి చెందిన ఉద్యోగులకు పూర్తి సంపాదిత సెలవులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటి వరకు లేని ఈ సదుపాయాన్ని కొత్తగా కల్పిస్తూ జీవో నెంబర్ 24 విడుదల చేసింది. ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసే సమయంలో వారు సర్వీసులో దాచుకున్న సంపాదిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం ఇప్పటికే ఉంది. ఏడాదికి ఆరు సెలవులు చొప్పున సర్వీస్ మొత్తంలో 250 వరకు దాచుకునే వెసులుబాటు ఉంది. ఇటీవల సంపాదిత సెలవులను సైతం 300కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు విరమణ చేసే సమయానికి ఎంత జీతం పొందుతున్నారో దాని ప్రకారం ఒక రోజు జీతాన్ని లెక్కగట్టి ఎన్ని సంపాదిత సెలవులు ఉంటే అంత మేర నగదు చెల్లించే పద్ధతి అమల్లో ఉంది. ఈ పరిమితి గరిష్ఠంగా 300 సెలవులు నిల్వ ఉంచుకుని నగదు పొందే వెసులుబాటు ఇప్పుడు ఉద్యోగులకు కలిగింది. ఇదే సమయంలో మరో నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వం జీవో నెంబర్ 234 విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సర్వీస్‌లో ఉండి ఏకారణం చేతనైనా ఉద్యోగి మృతి చెందితే సంపాదిత సెలవులు ఎన్ని ఉన్నా మొత్తం 300 సెలవులకు వేతనం లెక్కగట్టి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఉద్యోగుల భవిష్యనిధిపై వడ్డీ తగ్గింపును సహించం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరిక

**రాజధాని ప్రతినిధి–విజయవాడ :** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) వడ్డీ రేటును 8.8 శాతం నుండి 8.65 శాతానికి తగ్గించాలని బెంగుళూరులో జరిగిన ఈపీఎఫ్ఓ ట్రస్టీ బోర్డు సమావేశం నిర్ణయించడాన్ని ఎఐటీయూసీ రాష్ట్ర సమితి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. కార్మికులు తమ కష్టార్జితంతో దాచుకున్న సొమ్ముకు చెల్లించే వడ్డీని తగ్గించడం కార్మికుల శ్రమశక్తిని హరించడమేనని ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం రంగంలోని బ్యాంకులు సైతం తమ ఖాతాదారులకు ఇచ్చే రుణాలపై 9 నుండి 12 శాతం వడ్డీని చెల్లిస్తుండగా కార్మికులకు చెల్లించాల్సిన వడ్డీని తగ్గించడం తీవ్రమైన నేరంగా ఆయన పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని గతంలో చెల్లిస్తున్న 8.8 శాతం వడ్డీనైనా కార్మికులకు చెల్లించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే అన్ని కార్మిక సంఘాలు కలిసి ఉద్యమిస్తాయని ఓబులేసు హెచ్చరించారు.

## దళిత వేధింపుల్లో రాజస్థాన్ ఫస్ట్

- ప్రథమ స్థానంలో బీజేపీ పాలిత రాజస్థాన్
- తర్వాతి స్థానాల్లో యూపీ, బీహార్
- ఆంధ్రప్రదేశ్‌లో 9,054 కేసులు
- 2013–15 సంవత్సరాల గణాంకాల వెల్లడి

**న్యూఢిల్లీ :** ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకంగా జరుగుతున్న వేధింపులకు సంబంధించి బీజేపీ పాలిత రాజస్థాన్‌లో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. 2013–15 మధ్య కాలంలోని ఈ కేసుల్లో ఉత్తరప్రదేశ్, బీహార్ తర్వాతి స్థానాల్లో నిలిచినట్లు ఒక నివేదిక వెల్లడించింది. ఇంటువంటి కేసుల్లో దోష నిర్ధారణ రేటు కూడా అత్యల్పంగా ఉందని కేంద్రం గుర్తించింది. వేధింపుల నిరధక సవరణ (పీవోఏ) క్రింద రాజస్థాన్‌లో 23,861 కేసులు, అదేవిధంగా యూపీ, బీహార్‌ల్లో 23,556, 21,061 కేసులు నమోదయ్యాయి, షెడ్యూల్డ్ కులాలు,తెగలు (వేధింపుల నిరోధక) చట్టం–1989 అమలు సమీక్షకు సంబంధించి ఇక్కడ ఒక కమిటీ సమావేశంలో ఉంచిన అజెండా పత్రాలు ఈ వివరాలు వెల్లడించాయి. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌ల్లో వరుసగా 14,016, 9,054, 8,084, 7,565, 6,546, 5,131, 3,969 వేధింపుల నేర కేసులు ఈ సంవత్సరాల్లో నమోదయ్యాయి. 2013–15లో మొత్తం కేసులు (13,8077) కుగాను కేవలం 43.3శాతం మాత్రమే కోర్టుల్లో పరిష్కారమయ్యాయి. అయితే నమోదైన మొత్తం కేసుల్లో కోర్టుల ద్వారా శిక్షలు విధించబడినవి 25.7 శాతం (59,779) మాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో (6.3 శాతం), గుజరాత్ (3.1), కర్ణాటక (3.5) మహారాష్ట్ర (7.6), ఒడిశా (4.3), తమిళనాడు (7.5), తెలంగాణ (7.5), పశ్చిమ బెంగాల్ (3శాతం) గా ఏక సంఖ్యలోనే శిక్షలు పడినట్లు ఈ అజెండా పత్రం వివరించింది. ఇటువంటి కేసుల్లో శిక్ష రేటు, కేసుల పరిష్కారం మెరుగుకు సంబంధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి యాక్షన్ టేక్ నివేదికను కేంద్ర సామాజిక, సాధికార మంత్రి తవార్‌చంద్ గెహ్లాట్ నేతృత్వంలోని కమిటీ కోరింది. పీవోఏ చట్టం క్రింద నమోదైన కేసుల విచారణ వేగవంతానికి 14 రాష్ట్రాలు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసినట్లు ఈ సమావేశంలో గెహ్లాట్ ప్రస్తావించారు. ఇదిలాఉండగా, అస్సాం, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గోవా, హర్యానా, జార్ఖండ్, పంజాబ్, ఢిల్లీతో 22 రాష్ట్రాలు,



కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటుపై ఎటువంటి సమాచారం లేదని ఆయన పేర్కొన్నారు. ఒకటి లేదా మరిన్ని జిల్లాలకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు పీవోఏ చట్ట సవరణకు సంబంధించి సెక్షన్ 14 అవకాశం కల్పించింది. అది సెషన్స్ లేదా ప్రత్యేక కోర్టు కావచ్చునని తెలిపింది. ఏప్రిల్ 14, 2016న పీవోఏ నిబంధనల సవరణలో పేర్కొన్న విధంగా నేర స్వభావాన్ని బట్టి శిక్షను రూ.85 వేల నుంచి 8,25,000ల మధ్య బాధితులకు పరిహారం చెల్లించింది లేనిదీ ఏడు రోజుల్లోగా తెలియజేయాలని కమిటీ కోరింది.

## 72 గంటల్లో.. 4000 మెయిల్స్

**న్యూఢిల్లీ :** నల్లధనాన్ని స్వచ్ఛందంగా బయటికి వెల్లడించేందుకు, వాటిని పట్టుకునేందుకు ప్రభుత్వం రకరకాల మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటి వరకు పలు పథకాలను ప్రకటించిన తర్వాత నల్లధనానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలంటూ ఈ మెయిల్‌ను క్రియేట్ చేసింది. దానికి కేవలం 72 గంటల వ్యవధిలో 4 వేల మెయిల్స్ వచ్చినట్లు ఆర్థికశాఖ అధికారులు మీడియాకు వెల్లడించారు. పేరుతో మెయిల్‌ను క్రియేట్ చేసింది. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు తెలిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ, బ్యాంకు ఖాతాల్లో అక్రమంగా జమ అవుతున్న రోజువారీ నగదు వివరాలను ఆదాయపన్ను శాఖ అధికారులకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఎఫ్ఐయూ)ద్వారా ఎప్పటికప్పుడు అందుతోంది. దీని ద్వారా ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించగలిగామని ఓ అధికారి అన్నారు. రోజువారీ డిపాజిట్ల నివేదికను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అనుమానాస్పద ఖాతాలపై చర్యలు తీసుకుంటున్నారు. నల్లధనాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఇదొక ప్రోత్సాహం కానుంది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తర్వాత ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ అధికారులు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు, సోదాలు నిర్వహించి కోట్లకు కోట్ల అక్రమ నగదు నిల్వలను, ఆస్తులను పట్టుకుంటున్నారు. పలువురు బ్యాంకు అధికారులు కమీషన్లకు పాత నోట్లను మార్చుకొని కొత్త నోట్లను ఇస్తున్నారు.

## అవినీతి అధికారులకు శిక్ష

### యాక్సిస్ బ్యాంకు వివరణ

**న్యూఢిల్లీ :** అవినీతికి పాల్పడ్డ బ్యాంకు అధికారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు యాక్సిస్ బ్యాంకు యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లు బ్యాంకు లావాదేవీలు, బ్యాంకు సిబ్బందిపై కన్నేసి ఉంచాయన్నారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న యాక్సిస్ బ్యాంకు సీఈఓ, ఎండీ శిఖాశర్మ అక్రమాలకు బరితెగించిన కొంతమంది అధికారుల సమాచారమిచ్చారన్నారు. చట్ట వ్యతిరేకంగా పాత నగదుకు కొత్త నోట్లు ఇచ్చిన సిబ్బంది, నోట్లను పెద్ద ఎత్తున తరలించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించిన విలేకరులకు జైట్లీ సమాధానం చెబుతూ లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు పనిచేస్తున్నారని వారిలో చాలామంది అత్యుత్తమ సేవలందించారన్నారు. కూడా భారీ సంఖ్యలో ఉన్న ఖాతాదారులకు సంతృప్తికరంగా సేవలందించారని కొనియాడారు. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపడతాయన్నారు. ఈ వారం మొదటిలో ఇద్దరు యాక్సిస్ బ్యాంకు అధికారులను ఈడీ అరెస్టు చేసి 3 కేజీల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారన్నారు. మనీ లాండరింగ్ నిరోధ చట్టం ద్వారా పెద్దమొత్తంలో నగదును ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేసిన వారిపై దర్యాప్తు సంస్థలు నేరం నమోదు చేశాయని జైట్లీ పేర్కొన్నారు.

### రాష్ట్రంలో

## 'అశోక్ లేల్యాండ్' పరిశ్రమ?

### తయారీ యూనిట్ ఏర్పాటుకు మల్లవల్లి సహా పలు ప్రాంతాల పరిశీలన

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రాష్ట్రంలో తయారీ యూనిట్ నెలకొల్పడానికి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ 'అశోక్ లేల్యాండ్' ఆస్తకి చూపుతోంది. బస్సులు, ట్రక్కుల తయారీలో దేశంలోనే పేరుగాంచిన సంస్థల్లో ఒకటైన అశోక్ లేల్యాండ్ వస్తే రాష్ట్రానికి మరో భారీ పరిశ్రమ వచ్చినట్లే. కంపెనీ ప్రతినిధులు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) అధికారులతో సమావేశమై, తాము ఏపీలో యూనిట్ ఏర్పాటుకు ఆస్తకితో ఉన్నామని చెప్పారు. ఏపీఐఐసీ ఎండీ నివాస్ వారితో మాట్లాడుతూ ఏపీలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొస్తే పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అశోక్ లేల్యాండ్ తయారీ యూనిట్ స్థాపనకు అనూకులమైన పలు ప్రాంతాల గురించి అధికారులు వారికి వివరించారు, కృష్ణా జిల్లా గన్నవరానికి సమీపంలోని మల్లవల్లి యూనిట్ ఏర్పాటుకు 200 ఎకరాలు అవసరమవుతుందని తెలిపారు. ప్రతిపాదిత యూనిట్ పై స్పష్టమైన ప్రణాళికతో వస్తే కోరిన చోట స్థలం కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏపీఐఐసీ అధికారులు వారికి స్పష్టం చేశారు.

# కూల్‌డ్రింక్స్‌ను మానండి



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

**మ**న ఇంటికి ఎవరైన అతిథి వచ్చిన వెంటనే వారికి మంచినీరు ఇచ్చి స్వాగతం పలికే సాంప్రదాయం మనది. లేదా మజ్జిగ ఇచ్చి దాహం చల్లబరిచే సంస్కృతి మనది. ఏమీ చదువుకోని మన పెద్దలు మంచి అలవాట్లను మనకు నేర్పారు. మనం ఈ రోజు అన్నీ బాగా చదువుకోని ఏమీ నేర్పుతున్నాము, ఏమి చేస్తున్నామంటే ఇంటి వచ్చిన అతిథులకు, మన పిల్లలకు కూల్‌డ్రింక్ సీసాలను పెద్ద మొత్తంలో, పెద్ద సైజు సీసాలతో తెచ్చుకుని ఇంట్లో ఫ్రిజ్‌లో నిల్వయుంచి అటువచ్చి ఇటువచ్చి వాటిని ఆనందంగా తాగుచున్నాము. ఏదన్నా ఒకటి డబ్బు పెట్టికొని తిన్నామన్నా. తాగామన్నా దాని ద్వారా మనకు రుచితో, ఆనందంతో పాటు కొద్దిగా ఆరోగ్యము లభిస్తే పరవాలేదనుకోవచ్చు. కూల్‌డ్రింక్స్‌ను మనం తాగడం ద్వారా మనకు రుచితో పాటు ఆనందంతో పాటు మనకేమి వస్తుందో ఆలోచిద్దాము. ఒక పదార్థాంలో ఆమ్ల గుణం ఉన్నదా? క్షారగుణం ఉన్నదా? ఏది ఎంత ఉంది అని తెలుసుకోవడానికి పిహెచ్ మీటరు సహకరిస్తుంది పిహెచ్ అనేది 7 కంటే ఎక్కువగా ఉంటే క్షారగుణమని, 7 కంటే తక్కువ ఉంటే ఆమ్ల గుణమని (యాసిడ్) తెలుస్తుంది. ఏ పదార్థంలోనన్నా ఆ పిహెచ్ మీటరును ముంచితే ఆపదార్థము ఏ స్థితిలో ఉన్నది. ఆందులో నుండి వచ్చే అంకెను బట్టి తెలిసిపోతుంది. కూల్‌డ్రింక్స్‌ను గ్లానులో పోసి ఆ మీటరు ముంచితే వాటి బండారము బయటపడుతుంది. ఇప్పుడు మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న 10 రకాల కూల్‌డ్రింక్స్‌ను పరీక్షిస్తే వాటి పిహెచ్ అనేది 1.1 నుంచి 2.0 మధ్యలోనే అన్నింటికి ఉంటున్నది. తియ్యగా ఉండే వాటిలో, పుల్లపుల్లగా ఉండే వాటిలో కూడా అంత యాసిడ్ ఉన్నట్లుగా తెలుస్తున్నది. మనం లెట్రిన్స్‌ను శుభ్రం చేసుకునే యాసిడ్ సీసాలను చూసి ఉంటారు. ఆ యాసిడ్ యొక్క పిహెచ్ చూస్తే 1.5 నుండి 2.0 మధ్యలో ఉంటుంది. అంటే ఆ యాసిడ్ అంత ఘటుగా ఉంటుంది. కబట్టే ఎండిపోయిన మలంపై పోస్తే శుభ్రంగా తినేస్తుంది. మనం తాగే కుల్‌డ్రింక్ సీసాలు కూడా లెట్రిన్ క్లీన్ చేసే యాసిడ్‌తో సమానంగా ఆమ్ల గుణాన్ని కలిగి ఉన్నాయి. నేను చెప్పినది తప్పు అయితే మీరు ఈసారి లెట్రిన్ బాగా మనకలు పడి ఎండిపోయినప్పుడు దానిపై యాసిడ్ పొయ్యకుండా కూల్‌డ్రింక్ పోసి 5ని॥లు ఆగి శుభ్రం చేయండి. చక్కగా యాసిడ్ లాగా పనిచేసే ఆ ప్లేట్‌ను శుభ్రం చేసేస్తుంది. టాయ్‌లెట్ క్లీనర్స్‌తో సమానమైన కూల్‌డ్రింక్స్‌ను మనం తాగవచ్చా? మన పిల్లలచేత తాగించవచ్చా? ఆలోచించండి!

వాటిలో అంత యాసిడ్ ఎందుకుంటుందని మీకు అనుమానం కావచ్చు. ఆ కూల్‌డ్రింక్స్‌లో కలిపే రసాయనాలు చూస్తే మీకే తెలుస్తుంది. వీటిలో ముఖ్యముగా ఫాస్ఫారిక్ యాసిడ్, కార్బొలిక్ యాసిడ్, ఎరిథార్బిక్ యాసిడ్ మరియు బెంజాయిక్ యాసిడ్ అనేవి కలుపుతారు. ఇన్నిరకాల యాసిడ్‌లు కలిస్తేగానీ మనకు మజా రావడం లేదు. అందుచేతే కూల్‌డ్రింక్ తాగినపుడు గొంతులో, కడుపులో మంట, తేపులు, కపాలంలో, తలనరాలలో, విపరీతమైన బాద అసిడిటి మొ॥నవి వస్తుంటాయి. నాకొక చిన్నప్పటి విషయము గుర్తుకు వస్తున్నది. నేను పుట్టాక మొత్తం మీద 20 కూల్‌డ్రింక్‌లు తాగి ఉంటాను. ఒకసారి ఎక్కడో పెళ్ళిలో ఫ్రీగా వచ్చింది కదా అని థమ్సప్ తాగడానికి ప్రయత్నించాను. అది పొంగి నురుగ్గా రావడం చూస్తే నాకు భయం వేసింది. కాసేపటికి తాగాను. ఒక గుక్క మింగే సరికే గొంతులో మంటపుట్టినట్లుగా అయ్యి, బీరులాంటిదేమన్నా కలుపుతారా ఏమిటి, ఇంత ఘాటుగా ఉంది అనుకుని తాగలేక వదిలేసాను. అప్పుడు అర్థం కాలేదు కానీ ఇప్పుడు అలా మండడానికి కొంత కారణం ఏమిటో, ఆ పవరు ఏమిటో తెలుస్తున్నది. ఇంకొక రహస్యం మీకు తెలుసా! మనం చనిపోయిన తరువాత దహన సంస్కారం చేస్తే శవం పూర్తిగా కాలిపోతుంది. ఎముకలు పూర్తిగా కాలిపోతాయి. కానీ నోటిలోని పళ్ళు మాత్రం కలిపోవు, శవాన్ని కాల్చడానికి బదులుగా భూమిలో పాతిపెడితే శరీరము మొత్తంమట్టిలో కలిసిపోతుంది. 20 సం॥లు తరువాత ఆ మట్టి భాగాన్ని త్రవ్వి తీస్తే పళ్ళు చెక్కు చెదరకుండా అలానే ఉంటాయి. అంత గట్టిగా మన పళ్ళు తయారుచెయ్యబడ్డాయి. ఏ పళ్ళనేతే అన్ని కాల్చలేక పోయిందో, ఏ పళ్ళనైతే మట్టి తనలో కరిగించుకోలేకపోయిందో, అవే పళ్ళను 20 రోజులపాటు ఏదైనా ఒక కూల్‌డ్రింక్‌లో ఉంచి పరిశీలిస్తే అవి పూర్తిగా కరిగిపోతాన్నాయి. ఆ పళ్ళు నల్లగా మారి నొక్కితే పిండిగా అయిపోతున్నాయి. ఒక నల్లని రంగు కూల్ డ్రింకులో ఒక పన్నును వేసి 8వ రోజు చూసేసరికి ఆ పన్ను పూర్తిగా కరిగిపోయి, మాయమైనది. ఇది నేను స్వయంగా పరిశీలించిన విషయాము. మనం పుట్టిన దగ్గర్నుండీ చనిపోయేలోపులో సుమారు 50 టన్నుల ఆహారాన్నయినా ఈ పళ్ళతో నములుతాము. అన్ని టన్నుల ఆహారాన్ని నమిలినా అరగని పళ్ళు మాత్రం ఒక కూల్‌డ్రింక్ నెల తిరగకుండా కరిగించేస్తున్నదంటే అవి తాగే డ్రింకులా లేక విషపదార్థాలా? విషపదార్థాలే, కాకపోతే ఎక్కువగా నీటి శాతం ఉండబెట్టి మెల్లగా చంపే విషంలా పని చేస్తాయి. అలాంటి గట్టి పళ్ళనే నాశనం చేసే డ్రింక్స్‌కి మన లోపలి ప్రేగులు, నరాలు, కణాలు ఒక లెక్కా ఏమిటి? ఈ భూమిపై నివసించే ప్రతిప్రాణితో పాటు మనము కూడా ప్రాణవాయువును (ఆక్సిజన్)లోపలకు పీల్చుకుని, కార్బన్-డై-ఆక్సైడ్‌ను విడిచిపెడుతూ ఉంటాము. ఈ కార్బన్-డై-ఆక్సైడ్ అనే విషవాయువును కూల్‌డ్రింక్స్‌ను ఎక్కువ కాలంపాటు నిలవ ఉంచడం కొరకు అన్ని కూల్‌డ్రింక్స్‌లో కలుపుతారు. అందుచేతనే, మనం ఏ రకమైన కూల్‌డ్రింక్ తాగినా, తాగిన వెంటనే నోటిలో నుండి, ముక్కులో నుండి ఆ చెడ్డవాయువు బయటకు వస్తుంది. ఒక కాలేజీలో ఇద్దరు కుర్రవాళ్ళు పోటీ పెట్టుకొని ఒకరు 8 మరొకరు 9 కూల్‌డ్రింక్స్‌ను అతి కష్టంగా తాగారు. డాక్టరు వచ్చేలోపే ఇద్దరూ చనిపోయారు. శవపరీక్షలో చూస్తే, వారిద్దరి శరీరములో కార్బన్‌డైఆక్సైడ్ అనే విషవాయువు ఎక్కువై పోయి మరణించారనే తెలిసింది. ఈ విషయము ముంబాయిలో జరిగినది. ఆ డ్రింక్స్‌లో కలిపే విషవాయువు ఎంత హానికరమో అర్థమైనదా? కొన్ని రకాల కూల్‌డ్రిక్స్‌లో కాఫీ నుండి తీసే మందు కెఫిన్ అనే రసాయనిక పదార్థాన్ని మన భారతదేశంలో అమ్మే వాటిలో బాగా ఎక్కువగా కలుపుతున్నారు. ఈ కేఫిన్ మందువల్ల చిరాకు, నిద్రపట్టక పోవడం తలనొప్పిలాంటివి వస్తాయి. అన్నిరకాల కూల్‌డ్రింక్స్‌లో ఇంకా ఏమేమి కలుపుతారని రసాయనిక పరీక్షలు చేయగా తెలిసిన సత్యాలేమిటంటే, విషపూరిత రసాయనాలు అయిన ఆక్సనిక్, కాడ్మియం, జింక్, సోడియం, గ్లూటమేట్, పొటాషియం సార్బేట్, మిథాయల్ బెంజీల్, బ్రోమినేటెడ్ వెజిటబుల్ ఆయిల్ మొ॥నవి కలుపుతున్నట్లు వెల్లడైంది. ఇన్ని విషాలు కలిసినవి కాబట్టే 6 సం॥లలోపు పిల్లలు తాగరాదని హెచ్చరిక సీసాలపై వ్రాసి ఉంటుంది. మనదేశంలో వ్రాయడం లేదు. కూల్‌డ్రింక్స్‌లో అధికంగా పంచదార కలుపుతారు కాబట్టి పళ్ళు, ప్రేగులు దెబ్బతింటాయి. ఆ డ్రింక్స్‌లో శరీరానికి పనికి వచ్చే ఒక్క లాభమైన లేదు డబ్బు పెట్టి విషాన్ని కొనుక్కున్నట్లుగా ఉంది. మీ పిల్లలకు మీ చేతులతో కొనిపెట్టినా, మీరు డబ్బు ఇచ్చి ప్రోత్సహించినా, మీ చేతులతో వారి ఆరోగ్యాన్ని పాడుచేసినట్లే. కాబట్టి ఇలాంటి చెడు అలవాట్లను మానిపించి పిల్లలకు ప్రతిరోజూ పండ్లను, పండ్ల రసాలను ఎక్కువగా అందించే ఏర్పాటు చేయండి. చుట్టం వస్తే కూల్‌డ్రింక్ ఇచ్చి డబ్బులు వేస్టు చేయవద్దు. అతిథి దేవోభవ అన్నారు. దేవతాస్వరూపులైన అతిథులకు మంచినీరు ఇవ్వండి. ఆరోగ్యాన్నిస్తుంది. మన సమాజంలో ఇలాంటి చెడ్డ అలవాట్లను పూర్తిగా అరికట్టాలంటే ముందు మన ఇంటిలో అరికట్టాలి. కాబట్టి ప్రతి కుటుంబంలో ఏ ఒక్కరూ మీకై ఇలాంటి తప్పును చేసి ఆరోగ్యాన్ని పాడుచేసుకోండి. మీరు సంపాదించుకున్న డబ్బు మిమ్మల్ని నాశనం చేయకూడదు. కాబట్టి ఆ డబ్బుతో పండ్లు కొని, పళ్ళరసాలు పిల్లలకు అలవాటు చేస్తే ఎంతో ఇష్టంగా తాగుతారు. ఆరోగ్యాన్ని నింపుకుంటారు.

# నోట్ల రద్దు బాధితులంతా పేదలే

**హైదరాబాద్ :** పెద్దనోట్ల రద్దుతో చిన్న, మధ్యతరగతి ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు పడుతున్న బాధలు ప్రధానికి పట్టడం లేదని ప్రోగ్రెసి ఫోరం జాతీయ అధ్యక్షులు, ప్రొ.కె.ఎన్.చలం అన్నారు. నోట్ల రద్దు అనాలోచిత నిర్ణయమని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్న తరువాత నిర్ణయాలు తీసుకోవాల్సివుందని పేర్కొన్నారు. ప్రొగ్రెసీ ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పెద్ద నోట్ల రద్దు,దాని పర్యావసానాలు అన్న అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ సుధాకర్ అధ్యక్షత వహించగా, ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిూస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బిఎస్.రాంబాబు, ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ 99 శాతం మంది ప్రజలు పెద్దనోట్ల రద్దు వల్ల సమ్యసలు ఎదుర్కొంటురన్నారు. ఉగ్రవాదం, దేశ రక్షణ దొంగనోట్లు, నల్లధనం నియంత్రణ పేరుతో మోడీ నోట్లను రద్దు చేసి సమ్యసలను తెచ్చిపెట్టారని ఆరోపించారు. కొత్త నోట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి విధించిన ఆకాంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సంపన్నవర్గాలకు, పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు నోట్లు రద్దు వల్ల మేలు జరిగింది. తప్ప సామాన్యులకు జరగలేదని పేర్కొన్నారు. బడా బాబులకు కొత్త నోట్లు వేల కోట్లు ఎక్కడ నుంచి వస్తున్నాయని నిలదీశారు. నల్లధనాన్ని బయటకి తెచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానని వాగ్దానం చేసిన ప్రధాని మాటతప్పారని విమర్శించారు. కంపెనీలు, సంపన్నవర్గాలకు బ్యాంకుల నుండి తీసుకున్న లక్షల కోట్ల రూపాయలు అప్పులు మాసీ చేశారని విమర్శించారు. రాంబాబు మాట్లాడుతూ నోట్ల రద్దు వల్ల తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రధాని బేషజాలకు పోకుండా అన్ని రాజకీయ పక్షాలను పిలిచి సమస్య పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఆర్థిక విశ్లేషకులు పాపారావు మాట్లాడుతూ నల్లకుబేరులకు మేలు చేసే విధంగా ప్రధాన మంత్రి నిర్ణయం ఉందని ఆరోపించారు. పెద్దనోట్ల రద్దు వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, పెద్ద పారిశ్రామిక వేత్తలు, కంపెనీలు, అధికారుల బ్యాంకు అకౌంట్లు సీజ్ చేయాలన్నారు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తక్షణమే తీసుకురావాలన్నారు. సీపీఐ కార్యదర్శి వర్గసభ్యులు కూనంనేని సాంబశివరావు,ఎం.ఆదిరెడ్డి, ఎన్.బాలమల్లేష్, సీపీఐ హైదరాబాద్ కార్యదర్శి ఇ.టి.నరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు,కె.ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రసంగించగా, సిపిఐ నాయకులు కనకమామిడి శ్రీశైలంగౌడ్, కె.నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

# నిరసనబాటలో బ్యాంకు ఉద్యోగులు

- నోట్ల రద్దు సమస్యలపై ఆందోళన
- డిసెంబరు 28న నిరసన కార్యక్రమం
- 29న ఆర్థిక మంత్రికి లేఖ
- జనవరి 2,3 తేదీల్లో కూడా నిరసనకు ప్రణాళిక

**వడోదర :** పాత పెద్ద నోట్ల రద్దుకు సంబంధించి ఉద్యోగులకు, వేర్వేరు బ్యాంకుల్లో ఎదురవుతున్న సమస్యల నేపథ్యంలో అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం (ఏఐబీవోఏ) లు నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. డిసెంబరు 28న నిరసన కార్యక్రమంతో సహా 29వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి లేఖ రాయడం ద్వారా నిరసన కార్యక్రమాలను రూపొందించినట్లు రెండు యూనియన్లు తెలిపాయి. అలాగే 2017,జనవరి 2,3 తేదీల్లో కూడా ఇదే అంశంపై నిరసనను కూడా ప్రణాళిక చేశాయి. 'మా యూనియన్ల పిలుపు ప్రకారం ఇప్పటికే అన్ని ప్రధాన కేంద్రాల్లో సభ్యులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్‌బీఐ స్థానిక నిర్వహణాధికారులకు వినతి పత్రాలను కూడా అందజేయడం జరిగింది' అని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, ఏఐబీవోఏ ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజన్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అన్ని బ్యాంకు శాఖలకు తగినంత నగదును సరఫరా చేయాలని, పారదర్శకత పాటించాలని, ఎటువంటి జాప్యం లేకుండా ఏటీఎంలను పునరుద్ధరించాలని యూనియన్లు డిమాండు చేస్తున్నాయి. 'బ్యాంకులకు తగినంత నగదును ఆర్‌బీఐ సరఫరా చేయకపోయిట్లయితే, ఆ స్థాయిలో నగదును సరఫరా చేసేంత వరకు బ్యాంకు శాఖలన్నింటిలో లావాదేవీలను నిలిపివేస్తాం' అని ఆ ప్రకటనలో యూనియన్లు వివరించాయి. బ్యాంకుల్లో నగదు కొరత ఉన్నపుడు బడా బాబుల నుంచి పెద్ద మొత్తంలో కొత్త నోట్ల స్వాధీనంపై సీబీఐ విచారణ జరిపించాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. బ్యాంకు సిబ్బందిని వేధించకుండా అన్ని శాఖల్లో శాంతి, భద్రతల పరిరక్షణకు, బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు రక్షణ కల్పించేందుకు ఆర్‌బీఐ, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వత్తిడిలో చనిపోయిన బ్యాంకు సిబ్బంది కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాయి. గత నెల రోజులకుపైగా అత్యధిక పని గంటలు నిర్వహించిన ఉద్యోగులు, అధికారులకు తగిన ఆర్థిక సాయం చెల్లించాలని ప్రకటన పేర్కొంది. దేశంలో 9 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు ఉండగా 5.50 లక్షల మంది తమ సభ్యులుగా ఉన్నట్లు రెండు యూనియన్లు చెబుతున్నాయి.

## ఫిబ్రవరి 3 నుండి అంతర్వేది నర్సన్న కల్యాణోత్సవాలు : ఏసి చిక్కాల



**రాజధాని ప్రతినిధి, కోనసీమ-జిఎన్.రావ్ :** ఫిబ్రవరి 3 నుండి 11వ తేది వరకు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణ మహోత్సవాలకు ముహుర్తాలు నిర్ణయించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చిక్కాల వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో స్వామివారి సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధాంతి దైవజ్ఞ తంగిరాల ప్రభాకర పూర్ణయ్య గంటల పంచాంగాన్ని బట్టి ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్య ఇంజమూరి రామరంగాచార్యులు కల్యాణ మహోత్సవాలకు ముహుర్తాలను నిర్ణయించారు. కల్యాణ మహోత్సవాల శుభలేఖను తయారుచేసి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చిక్కాల వెంకట్రావుకు అందజేశారు. కల్యాణ మహోత్సవాల్లో జరిగే కార్యక్రమాలు, వాటి సమయాలు త్వరలోనే ప్రకటిస్తామని ప్రధానార్చకుడు శ్రీనివాస్‌కిరణ్ తెలిపారు.

## ఉగ్రవాదం కట్టడికే నోట్ల రద్దు

### కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్



**హర్దోయ్ (ఉత్తరప్రదేశ్) :** దేశంలో పరిస్థితులను మెరగు పర్చేందుకు తీసుకున్న నోట్ల రద్దు చర్య న్యాయమైనదేనని, ఉగ్రవాదం, మావోయిస్టులను కట్టడి చేయడానికి ఇది దోహదపడుతుందని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'నోట్ల రద్దు మాకోసం లేదా మెజార్టీ ప్రజల కోసం కాదు. దేశంలో అవినీతి లేకుండా మెజార్టీ ప్రజల కోసం కాదు. దేశంలో అవినీతి లేకుండా చేసేందుకే ఈ చర్య' అని ఇక్కడ ఐటీఐ మైదానంలో బీజేపీ పరివర్తన ర్యాలీలో ఆయన తెలిపారు. నోట్ల రద్దు అంశాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో చర్చించేందున ప్రజల ముందు, సభల్లో చర్చిస్తున్నామన్నారు. కొన్ని సార్లు తప్పిదాలు జరుగు తాయని, అయితే అవి కావాలని చేసినవి కాదని చెప్పారు. దేశంలోని పేద, ధనిక వర్గాల కోసం ఇదే విధానం ఉంటుందన్నారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సమించడాన్ని పాకిస్తాన్ నిలిపివేయాలని పేర్కొంటూ ఉగ్రవాదుల సాయం తీసుకునేది కేవలం పిరికిపందలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఉగ్రవాదం మంచిదా కాదా అన్నది కాదు. ఉగ్రవాదం ఉగ్రవాదమేనని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న యూపీలో అధికారం ఇస్తే మంచి పాలన అందిస్తామన్న హామీలపై రాజ్‌నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకేతమ పార్టీ రాజకీయాలు చేయదన్నారు. కానీ దేశాన్ని అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఎస్పీ, మరో బీఎస్పీలు చాలాకాలం అధికారంలో ఉన్నా నిరుద్యోగం, అవినీతిని అంత మొందించలేకపోయాయని చెప్పారు. రాష్ట్రంలో గూండా రాజ్యం కొనసాగుతోందని, తాము అధికారంలోకి వస్తే గూండా లేదా మాఫియా ఉండబోదన్నారు. వాజ్‌పేయి ఆరేళ్ల పాలనపై వేలెత్తి చూపినవారు లేరని, కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

## జాగ్వార్ ల్యాండ్ రోవర్ కొత్త ఎవాక్యూ

**ప్రారంభ ధర**
**రూ.49.1 లక్షలు**



**ఢిల్లీ :** టాటా మోటార్స్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) మరింత మెరుగుపరచిన రేంజ్ రోవర్ ఎవాక్యూను తీసుకొచ్చింది. దీని ధరను రూ. 49.10-67.90 లక్షల (ఎక్స్‌షోరూం, ఢిల్లీ) మధ్య నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ వాహనం ఆరు రకాల్లో లభిస్తుందని తెలిపింది.దేశీయ విపణిలో ఇంజిన్, యాక్సిల్ రెండూ కలిసి ఉండే 'పవర్‌ట్రైన్' సాంకేతికతతో తీసుకొచ్చిన తొలి ల్యాండ్ రోవర్ వాహనం ఇదేనని వివరించింది. 2017 మోడలైన ఈ కారుకు 2.0 లీటర్ల ఇంజినీయమ్ డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. దేశీయ విపణిలో తొలిసారి ప్రవేశపెట్టినప్పటి నుంచీ రేంజ్ రోవర్ ఎవాక్యూ వాహనానికి మంచి స్పందన వస్తోందని జేఎల్ఆర్ ఇండియా అధ్యక్షుడు రోహిత్ సూరి అన్నారు.

## ముద్రగడ పిలుపు మేరకు

# కాపునేతల నిరసనలు



**రాజధానిప్రతినిధి, కోనసీమ-జిఎన్.రావ్ :** కాపు అనుబంధ కులాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ, గతంలో ఉన్న రిజర్వేషన్లను పునరుద్ధరించాలని కోరుతూ కోనసీమలో పలు మండలాల్లో కాపు నేత, కాపు యువత ఆధ్వర్యంలో ఆకలి కేకలు వినిపించేలా కంచాలపై గరిటెలతో కొట్టి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పిలుపుమేరకు కోనసీమ వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అమలాపురంలో కాపు రిజర్వేషన్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, కన్వీనర్ కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నోటికి నల్ల రిబ్బన్లు ధరించి కంచం, గరిటెలతో నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కాపులను పావులుగా వాడుకుని గద్దెనెక్కిన పాలకులు అణచివేతకు దిగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ కంచం, గరిటెలతో ఆకలి కేకల నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద మానవహారంగా ఏర్పాడ్డారు. పట్టణ సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ విజయ్‌శంకర్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో సూదా గణపతి, వంటెద్దు బాబి, కురచా ఆంజనేయులు, అడపా వీరనూకమాచరావు, వాకపల్లి శ్రీను, తిక్కా ప్రసాద్, బొడపాటి గోపాలకృష్ణమూర్తి, రాయపురెడ్డి ప్రసాద్, కంకపాటి వీరబాబు, కల్వకొలను బాబి, దున్నాల వేణు, వర్రే శేషు, సుంకర సుధ, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు, నిమ్మకాయల సురేష్, చిక్కాల రవిశంకర్, జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ముమ్మిడివరం కాపు నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని కంచాలు, గరిటెలతో శబ్దాలు చేస్తూ గాంధీ బొమ్మ సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ నిరసన ర్యాలీ సాగింది. వినతిపత్రాన్ని అందించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌కు తరలివెళ్లి సిఐ కెటిటివి రమణారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కాపు నాయకులు గోదశి నాగేశ్వరరావు, గుద్దటి జమ్మి, సలాది శేషారావు, రంబాల బోసు, గణేశుల బ్రహ్మానందం, రాయపురెడ్డి జానకిరామయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కాపులు హాజరు కావాలని కోరారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాలకు చెందిన కాపు నాయకులు యేడిద నాని, కవల సూరిబాబు, కడియం తమ్మయ్య, బోనం సూర్యం, గుద్దటి వెంకట్రావు, యేడిద దొరబాబు, గొలకోటి సత్తియ్యనాయుడు, మహాదశ శ్రీరామమూర్తి, బొర్రా విష్ణు, మునుకోటి జాజి, గేదెల రఘునాథబాబా, జంగారెడ్డి రమేష్, నిమ్మన భాస్కరరావు, గొలకోటి సాబాబు, తోలేటి శ్రీను, జగతా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో కాపులను బిసిల్లో చేర్చాలని ముద్రగడ పద్మనాభం ఇచ్చిన పిలుపు మేరకు అల్లవరం మండలం కాపు ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాపుయువత నోటికి నల్ల రిబ్బన్లు ధరించి కంచాలను గరిటెలతో వాయిస్తూ నిరసన తెలిపారు. మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయం రోడ్ల మీద నిరసనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాపు ఐక్యవేదిక కన్వీనర్ చిట్టినీడి శ్రీను, కంకిపాటి సుబ్బారావు, కంకిపాటి వీరబాబు, తిక్కా ప్రసాద్, బసవా ఆనంద్, పిల్లా ప్రసాద్, సుంకర సాయి, వర్రే సూరిబాబు, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| స్వామి, రాయపూడి | రాజు, ఫిరంగిపురం | ఎస్.విష్ణుమూర్తి, కాకినాడ | అడపా సూరిబాబు, ఎం. మాచవరం | గాదె శ్రీనివాసరావు, గోపాలపురము | తోటా రాజు, ఏలూరు | బాలెం. నూకరాజు, పిఠాపురం | ఎం.నాగభూషణ, ఆకివీడు | ఎస్.ఆర్.సి. రాజు, వైజాగ్ | పి.సూర్య ప్రకాష్, కొత్తపేట,విజయవాడ |
| టి.హనుమంతరావు, సింగినగర్,విజయవాడ | ఎన్.శ్రీను, చేబ్రోలు | ఎన్.శివ, చేబ్రోలు | రవిశంకర్, సింగినగర్,విజయవాడ డడడ | వి.వి.ఎస్.ప్రసాద్ రావు, విజయవాడ | తాడేపల్లి వి.కె.ఎస్. శాస్త్రి, విజయవాడ | టి.వి.గంగాధర్‌రావు, దేవినగర్,విజయవాడ | జి.ఆర్.భరత్వాజ్, విద్యానగర్,హైదరాబాద్ | సయ్యద్ రాజక్‌వలీ, ఆకివీడు | ఎం.గోపాల కృష్ణ ప్రసాద్, విద్యానగర్, ఏలూరు |
| కె.శ్రీనివాస్‌రావు, ఆత్మకూరు | బి.అనీల్‌కుమార్, మురళీనగర్, వైజాగ్ | ఎ. సుబ్బారావు, కొయ్యలగూడెం | కె.వి. రామారావు, జంగారెడ్డి గూడెం | ఎం.సుబ్రమణ్యం, విజయవాడ | వి.సుబ్రమణ్యం, ఏలూరు | ఎన్.రామోహన్‌రావు, ఏలూరు | బి.సురేంద్రనాథ్ బెనర్జీ, భీమవరం | కాకర జీవన్ తణుకు | ఎస్.మునీశ్వర్ రావు, రాజేశ్వరీనగర్,ఏలూరు |
| ఎస్.కె.హుస్సేన్‌భాషా, తంగినమూడి | బాల సౌర్య, ఏలూరు | మాచర్ల కిశోర్ కుమార్, చింతలపూడి | డి.సత్యనారాయణ | హెచ్.విజయ్‌కుమార్, | భరత్ చవాకుల, పెనుమంట్ర | గోలి వెంకటరత్నం, కొవ్వూరు | ఎం.నాగరాజు, మచిలీపట్నం | వల్లాబాపురంబుజ్జిబాబు మచిలీపట్నం | పి.శ్రీనివాస్, ద్వారకా తిరుమల |
| సాలీ రోజా, విజయవాడ | పాండురంగారావు, హైదరాబాద్ | హరీష్, హైదరాబాద్ | జకీర్ హుస్సేన్ , గుంటూరు | | | | పద్మసత్యసావిత్రి(త్రినాథ్, నరసాపురం | తాళంహనుమంతరావు ఉండి | డబ్ల్యు ఎస్. మూర్తి, వీరవాసం |
| దేవాసహాయం, హనుమాన్‌జంక్షన్ | వెంకట్, తిరుపతి | శ్రీను, | రామారాజు | | | | పి.వి. వెంకటరావు, మచిలీపట్నం | జి.ఆనంద్, మచిలీపట్నం | మధు, అన్నవరం |
| రాము, టి. నర్సాపురం | శివ ప్రసాద్, కైకలూరు | రాంప్రసాద్, పాలకొల్లు | వి.బుజ్జి బాబు, గుడివాడ | | | | ఎ. మేరి దివ్య, తుని | జి. అరుణ్ కుమార్, అన్నవరం | ఎం. అన్వేష్‌బాబు, అన్నవరం |
| శ్రీరామ్, | సురేంద్రబాబు, అన్నవరం | నాగశ్రీనివాస్, పాలకొల్లు | ఇబ్రహీం, మంగళగిరి | | | | కరిముల్లా, రాయపూడి | అన్వర్, రేపల్లె | చంద్రశేఖర్, తెనాలి |
| వలి, విజయవాడ | ప్రసాద్, విజయవాడ | ఆల్‌వార్‌స్వామి, కంకిపాడు | వాహిద్, గుంటూరు | నాగేశ్వరరావు, మచిలీపట్నం | బేగ్, విజయవాడ | మాథూర్, నిడదవోలు | కేశవ్, నెల్లూరు | ప్రసాద్, మంగళగిరి | చిన్నరాజు, తెనాలి |
| పాండురంగారావు, హైదరాబాద్ | రాఘవరావు, హైదరాబాద్ | సుబ్బారావు, విజయవాడ | ఏడు కొండలు , తాడేపల్లి | నారాయణ మూర్తి , నిజాం పట్నం | కృష్ణ మూర్తి , తాడేపల్లి | అబ్దుల్ లతీఫ్, కానూరు | సయ్యద్ అమిద్ , గుంటూరు | జీవన్ బాబు, కామవరపు కోట | సత్యనారాయణ రాజు ఏలూరు |




## కోనసీమలో ఫ్యాషన్ డిజైనర్ సన్నాఫ్ లేడీస్ టైలర్ సినిమా చిత్రీకరణ : వంశీ



**రాజధాని ప్రతినిధి,కోనసీమ -జివిఎన్.రావ్ :** కోనసీమలో త్వరలో తన దర్శకత్వంలో నిర్మించే ఫ్యాషన్ డిజైనర్ సన్నాఫ్ లేడీస్ టైలర్ చిత్రం షూటింగ్ నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు ప్రముఖ దర్శకుడు వంశీ తెలిపారు. స్మార్ట్ విలేజ్‌గా ఎంపికైన సఖినేటిపల్లి మండలం మోరి, మోరిపోడు గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను పాపికొండల్లో చిత్రీకరించినట్లు వంశీ తెలిపారు. కోనసీమలో షూటింగ్ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ఆయా గ్రామాలకు జాతీయ గుర్తింపు రానుందని అన్నారు. మోరి చేనేత సొసైటిని ఆయన సందర్శించి చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రశంసించారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ

**రాజధాని ప్రతినిధి,కోనసీమ-జివిఎన్.రావ్ :** అమలాపురం పట్టణంలో ఓఎన్‌జిసి సహకారంతో భారతీయ విద్యా భవన్స్, గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కంప్యూటర్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కోఆర్డినేటర్ అయ్యగారి అమ్మిరాజు తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల లోపు యువతీ, యువకులు, గృహిణులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరిమితి ఆదాయ వర్గానికి చెందిన వారు మాత్రమే ఈ శిక్షణకు అర్హులు. కంప్యూటర్‌లో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, అడ్వాన్స్‌డ్ ట్యాలీ, డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, మొబైల్ రిపేరింగ్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. వచ్చే ఏడాది జనవరి 17 నుండి ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం డీలక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న కార్యాలయంలోను, సెల్ నం : 90000 56235ను సంప్రదించవచ్చు.

## ఏరియా ఆసుపత్రిలో ఈసిజి మెషిన్ ప్రారంభం



**రాజధాని ప్రతినిధి,కోనసీమ -జివిఎన్.రావ్ :** అమలాపురం రోగులకు అవసరమైన మౌళిక వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు తెలిపారు. నూతనంగా ఏర్పాటుచేసిన ఈసిజి మెషిన్, ల్యాబర్ టేబుల్, పల్స్ ఆక్సిమేటర్‌లను ప్రారంభించారు. కొత్తగా జన్మించే శిశువులకు,తల్లులకు ట్యాగింగ్ విధానాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మోకా ప్రసాదరావు ఆసుపత్రి ప్రగతిని వివరించారు. గత నవంబర్ నెలలో 243 డెలివరీలు నిర్వహించామని అన్నారు. నిత్యం 500 నుండి 600 మంది రోగుల వరకు వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నల్లా స్వామి, మాజీ ఏఎంసి చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ కౌన్సిలర్ బత్తుల సాయి, కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, ఆర్ఎంఓ డాక్టర్ ఎన్‌విఎస్.సుబ్బరాజు, టిడిపి నాయకులు నల్లా చిట్టిబాబు, చెరుకూరి సాయిరామ్, వలవల శివరావు, అల్లాడ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల నూతన కార్యవర్గం

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జివిఎన్.రావ్ :** ముమ్మిడివరం మండల వీఆర్వోల నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విఆర్వోల సమావేశంలో అధ్యక్షుడిగా కేశనకుర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎన్.ఉమామహేశ్వరరావు,ప్రధాన కార్యదర్శిగా ఆకుమర్తి దిలీప్‌కుమార్,కోశాధికారిగా దాట్ల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఆర్.భాస్కరరావులతో పాటు గౌరవాధ్యక్షుడిగా ఎల్‌కె.శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

# మైనారిటీ హక్కుల సాధనకు కృషి చేద్దాం

### అఖిలభారత తన్జీమ్-ఏ-ఇన్సాఫ్ జాతీయ మహాసభ తీర్మానం

మైనారిటీల హక్కుల కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని అఖిలభారత-ఏ-ఇన్సాఫ్ (ఏఐటీఐ) రెండో జాతీయ మహాసభ తీర్మానించింది. మైనారిటీల సామాజిక-ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి కోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలు, ప్రాజెక్టులు, రాజ్యాంగ హక్కుల అమలు కోసం విస్తృతంగా కృషిచేయాలని, భావోద్వేగ రాజకీయాలను విడనాడి అభివృద్దే అజెండాగా పనిచేయాలని మహాసభ నిర్ణయించింది. డిసెంబరు 4-6 తేదీలలో బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో ఈ మహాసభలు జరిగాయి. మహాసభ అనేక తీర్మానాలను ఆమోదించింది. సయ్యద్ అజీజ్ పాషా, అప్పాదురై, సోహెబ్ షేర్వానీ, ఘజన్ఫర్ నవాబ్, ఇఫ్తెఖార్ మెహమూద్‌లు అధ్యక్షవర్గంగా మహాసభను ప్రారంభించారు. మూడేళ్ల క్రితం అలీఘర్ సదస్సులో ఏఐటీఐ ఏర్పడిందని గుర్తుచేశారు. మైనారిటీలు ముఖ్యంగా ముస్లింల సామాజిక-ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి కోసం క్షేత్రస్థాయి ఉద్యమాలు అవసరమని ఆయన అన్నారు. తమ కోసం ప్రవేశపెట్టిన అనేక పథకాల గురించి మైనారిటీలకు పూర్తిగా అవగాహన లేదని ఫైజీ తెలిపారు. స్కాలర్‌షిప్పులు, ప్రైయారిటీ బ్యాంకు రుణాలు, ప్రభుత్వ గృహపథకాల్లో కోటా, మైనారిటీ విద్యాసంస్థలకు ప్రత్యేక నిధులు, మైనారిటీల్లోని ఓబీసీలకు ఉద్యోగాలు, విద్యాసంస్థలో రిజర్వేషన్లు వంటి అనేక పథకాలు, ఉన్నాయని ఆయన వివరించారు. ఆయా పథకాల అమలులోనూ వివక్షుందన్నారు. ఇలాంటి పథకాలు, ప్రాజెక్టులను గుర్తించి, అవి పూర్తి స్థాయిలో అమలయ్యేలా చేయాల్సిన బాధ్యతను ఏఐటీఐ జిల్లాస్థాయి శాఖలు చేపట్టాలని ఫైజీ అన్నారు. కేవలం మూడేళ్లలోనే దేశంలోని 22 రాష్ట్రాల్లో ఏఐటీఐ శాఖలు విస్తరించటంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. అనేక అంశాలు ఉద్యమాలు, ప్రచారాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆహ్వాన సంఘం, ప్రధాన కార్యదర్శి అహ్మద్ ఫత్మీ స్వాగతం పలికారు. 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక అనేక రైళ్లు రద్దు కావడంతో చాలా మంది ప్రతినిధులు హాజరుకాలేపోయారు. తొలిరోజున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ సింగ్, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి విశ్వజిత్ సింగ్, కమ్యూనిస్టు సీనియర్ నేత జబ్బార్ ఆలం ప్రతినిధులకు అభివాదం చేశారు. మైనారిటీలు, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ విద్యావేత్త డా॥ సుభోద్ మలకర్ మాట్లాడారు. సయ్యద్ అజీత్ పాషా ప్రస్తుత రజకీయ పరిణామాలపై సంక్షిప్తనివేదిక సమర్పించారు. ఏఐటీఐ తమిళనాడు శాఖ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ మాజీ సభ్యులు అప్పాదురై తన అనుభవాలను సభికులతో పంచుకున్నారు. అలీఘర్ గత సదస్సు అనంతరం జరిగిన కార్యక్రమాలపై నివేదికను ఏఐటీఐ ప్రధాన కార్యదర్శి డా॥ఖాన్ ప్రవేశపెట్టారు. సంస్థ అంచెలంచెలుగా వృద్ధిచెందుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. 22 రాష్ట్రాలకు ఏఐటీఐ వ్యాపించినప్పటికీ జిల్లాల్లో దీనిని విస్తరింపజేయటం అన్నది పెద్ద సమస్యగా ఉందని ఖాన్ అన్నారు. గత సదస్సు తర్వాత ఏఐటీఐ మూడుసార్లు ఎగ్జిక్యూటివ్‌ల వార్షిక సమావేశాన్ని నిర్వహించిందని ఆయన తెలిపారు. సదస్సు రెండో, మూడో రోజున వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. బీహార్ మైనారిటీ వ్యవహారాల మంత్రి అబ్దుల్ గఫూర్ ప్రతినిధుల సమావేశానికి హాజరయ్యారు. 39 మంది ప్రతినిధులు



చర్చల్లో పాల్గొన్నారు.

ప్రతినిధుల సభ చివరి రోజు వ్యవస్థాగత అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, కొన్ని నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. పాట్నా డిక్లరేషన్‌తో పాటు ముస్లింల రిజర్వేషన్, ఉమ్మడి పౌరస్మృతి నేపథ్యంలో నరేంద్రమోడీ ప్రభుత్వంపై తీసుకోవాల్సిన చర్యలు, వక్ఫ్ ఆస్తులు, హిందుత్వ సిద్ధాంతాలను పెంపొందించే చరిత్ర, విద్యావ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. మహాసభ కొత్త కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షులుగా సయ్యద్ అజీజ్ పాషా ఎన్నికకాగా ఉపాధ్యక్షులుగా షమీమ్ ఫైజీ, అప్పాదురై, సోహెబ్ షేర్వానీ, ప్రధాన కార్యదర్శిగా డా॥ఏఏఖాన్, కార్యదర్శులుగా ఇఫ్తెఖార్ మెహమూద్, ఇస్లామొద్దీన్ ఖురా (మణిపూర్), రహీలా పర్వీన్ (జేఎన్‌యూ, ఢిల్లీ) ఎన్నికయ్యారు. మరో ఉపాధ్యక్షుడ్ని, కార్యదర్శిని తర్వాత ఎన్నుకోనున్నట్టు సమావేశం తెలిపింది. రాష్ట్రశాఖల అధ్యక్షులు, కార్యదర్శులంతా కూడా జాతీయ కార్యవర్గంలో సభ్యులేనని పేర్కొంది.

ముగింపు సభలో రాజ్యాంగ హక్కులు, లౌకికవాదంపై ప్రధానంగా చర్చ జరిగింది. డిసెంబరు 6న చారిత్రక బాబ్రీ మసీదు ధ్వంసమైందని షమీమ్ ఫైజీ గుర్తుచేశారు. అది కేవలం ఒక మసీదుపై దాడి కాదు భారత రాజ్యాంగ మూలాలపై దాడి అని ఆయన అభివర్ణించారు. మతహింస పేట్రేగిపోతున్న నేటి తరుణంలో లౌకిక సిద్ధాంతాలను పెంపొందిస్తూ, మైనారిటీల కోసం ఏఐటీఐ పాటుపడుతున్నదని బీహార్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అబ్దుల్ బారీ సిద్దీఖీ కొనియాడారు. హిందుత్వ దళాలను అడ్డుకునేందుకు సుక్యూలర్ దళాలన్నీ ఐక్యం కావాలని షకీల్‌అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ ప్రధాన వక్తగా సుమారు గంట సేపు ప్రసంగించారు. నేడు దేశభక్తి నినాదాలు చేస్తున్న వారు నాడు స్వాతంత్ర్య సమరంలో మచ్చుకైనా లేరని విమర్శించారు. వాస్తవానికి వారంతా బ్రిటీష్ వారితో జతకట్టారని అన్నారు. ప్రస్తుత పాలనా యంత్రాంగం రాజ్యాంగ మూలాలను తుడిచివేసేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యాబట్టారు. ఫాసిస్టు నియంతృత్వాన్ని అమలు చేయాలని చూస్తోందని అతుల్ కుమార్ అంజాన్ అన్నారు.

సయ్యద్ అజీజ్ పాషా, మాట్లాడుతూ మైనారిటీల కోసం వార్షిక బడ్జెట్‌లో 0.21శాతాన్ని మాత్రమే కేంద్రప్రభుత్వం కేటాయిస్తోందని, అందులో చాలా వరకు మురిగిపోతుందని అన్నారు. మైనారిటీల మెజారిటీ ప్రాంతాల్లోనూ అత్యధిక శాతం నిధులు మైనారిటీయేతరుల సంక్షేమార్థం వినియోగిస్తున్నారని అజీజ్ పాషా తెలిపారు. ఏఐటీఐ బీహార్ శాఖ కార్యదర్శి ఇర్ఫాన్ ఫత్మీ కూడా సందేశాన్నిచ్చారు. సభాప్రాంగణాన్ని ఏఐటీఐ బ్యానర్లు, జెండాలతో అలంకరించారు. మీటింగ్ హాల్‌కు షహీద్ అష్ఫాఖుల్లా పేరుపెట్టారు. సభా వేదికకు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ మంచ్‌గా నామకరణం చేశారు. షహీద్ భగత్‌సింగ్, మదర్‌థెరిస్సా స్మారకార్థం ప్రత్యేక గేట్లు ఏర్పాటు చేశారు. డైనింగ్ ఏరియాకు మౌల్వీ మజహరుల్ హక్ పేరు పెట్టారు. చివరగా, ఏఐటీఐ రాష్ట్ర అధ్యక్షులు ఘజన్ఫల్ నవాబ్ వందన సమర్పణ చేశారు.

# నగర పంచాయితీ వార్షిక బడ్జెట్ ఆమోదం

**రాజధాని,ప్రతినిధి,కోనసీమ-జివిఎన్.రావ్ :** ముమ్మిడివరం నగర పంచాయితీలో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయిల నిధులు విడుదల అవుతున్నా నిధుల ఖర్చులకు అంచనాల ప్రణాళికలు రూపొందిస్తున్నా ప్రజాసమస్యలు పరిష్కారం కావడంలేదని పంచాయితీ ఫ్లోర్ లీడర్ జనిపెల్ల రమేష్‌బాబు నగర పంచాయితీ బడ్జెట్ సమావేశంలో కమిషనర్ పి.రవివర్మను నిలదీశారు. నగర పంచాయితీ చైర్మన్ చెల్లి శాంతకుమారి అధ్యక్షతన నగర పంచాయితీ కౌన్సిల్, బడ్జెట్ సమావేశం జరిగింది. సమావేశంలో 2017-18 అంచనాలను కౌన్సిల్ ముందుంచగా, 13, 14 ఆర్థిక సంఘ నిధులు ఏ పనులకు ఎంతమేరకు ఖర్చు చేశారన్న విషయాలను సమగ్రంగా కౌన్సిలర్లకు తెలియజేయాలని ఫ్లోర్ లీడర్ రమేష్‌బాబు డిమాండ్ చేశారు. 13వ ఆర్థికసంఘం నిధులకు సంబంధించి రూ.1.18కోట్లు ఖర్చు చేశామని, రూ.80లక్షలకు సంబంధించి బిల్లులు పెండింగ్, డిపాజిట్లు చెల్లింపులు వంటివి ఉన్నట్లు కమిషనర్ వివరించారు. 14వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.1.30 కోట్లలో ఇప్పటివరకు రూ.4.22 లక్షలు మాత్రమే ఖర్చు చేశామని మిగతా వాటికి టెండర్లు పిలిచామని కమిషనర్ వివరణ ఇచ్చారు. వైసిపి కౌన్సిలర్ల వార్డుల్లో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు వంటి



చెల్లి శాంతకుమారి

సమస్యలున్నా వాటిని పరిష్కరించినా దాఖలాలు లేవని, కేవలం అభివృద్ధి అంతా టిడిపి కౌన్సిలర్లు ఉన్న వార్డులకు మాత్రమే పరిమితం చేస్తున్నారని వైసిపి కౌన్సిలర్లు రమేష్‌బాబు, పిల్లి నాగరాజు, భీమవరపు విజయ్, రెడ్డి రజనీకుమారిలు ఆరోపించారు. పారిశుధ్యాన్ని పట్టణ ప్రాంతానికే పరిమితం చేస్తున్నారని, రూరల్ ప్రాంతాల్లో పారిశుధ్యం, దోమల నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఫ్లోర్ లీడర్ నిలదీయడంతో పారిశుధ్య సిబ్బంది కొరత కారణంగా కొంతకాలంగా స్ప్రే చేయలేకపోయామని కమిషనర్ తెలిపారు. అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో ఎల్ఈడి బల్బుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ వెంకటరావు అన్నారు. రూ.3.50లక్షలు గృహ నిర్మాణానికి మంజూరు అవుతుందని, ప్రస్తుతం డిమాండ్ సర్వే జరుగుతుందని టిపిఓ రామకృష్ణ వివరించారు. గృహనిర్మాణ, విద్యుత్ శాఖల అధికారులు విధిగా సమావేశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సాంకేతిక పరమైన లోపాలు కారణండా మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతుల మంజూరులో జాప్యం జరిగిందని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీనిచ్చారు. సమావేశంలో వివిధ పనుల బిల్లుల చెల్లింపు, జీతభత్యాలకు సంబంధించి 1వ పద్దు నుండి రూ.33.71లక్షలు, రెండవ పద్దు నుండి రూ.5,69,465 బిల్లులను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం 2017-18 అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ముందుంచారు. ప్రారంభ నిల్వ రూ.2,21,31,470 కాగా, మూల ధన జమలో వివిధ గ్రాంట్లకు సంబంధించి ఆదాయం రూ.14,17,13,200గా చూపిస్తూ మొత్తం రూ.16.38 కోట్ల అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. దీనిలో రాబడి వ్యయం రూ.3,17,40,000, మూలధన ఖర్చులు రూ.12,63,90,000 చూపిస్తూ ముగింపు నిల్వను రూ.57,14,670గా చూపించి బడ్జెట్ అంచనాను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ దివి మహాలక్ష్మి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వైపింగ్ యంత్రాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థినుల ర్యాలీ




**రాజధాని ప్రతినిధి,కోనసీమ-జివిఎన్.రావ్ :** ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీలకు అలవాడు పడాలని ముమ్మిడివరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, రఘుపతి వెంకయ్యానాయుడు డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు స్వైపింగ్ యంత్రాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్వైపింగ్ యంత్రాలను గ్రామాల్లో ఎలా ఉపయోగించాలి, నగదు బదిలీ ఏలా చేయాలని అనే అంశాలపై మహిళకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఓలు కెబివి.మోహనరావు, కెఎస్‌వి.సత్యనారాయణరావు, కె.సత్తిబాబు, రాజేంద్రబాబు, డైరక్టర్ జి.బ్రహ్మానందం, వైవి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రెండున్నరేళ్ల మోడీ పాలన



గత ప్రభుత్వాలు, అన్యాయాలకు, అక్రమాలకు పాల్పడిన విషయాలు తెలిసినవే.. కాని, మోడీ పరిపాలనలో అత్యున్నత విద్యాలయాలపై ఉక్కుపాదం మోపడం, ప్రజలను హింసించడం, వారి ఆహారపు అలవాట్లను ప్రశ్నించడంతో మొదలైంది. బీజేపీ ప్రభుత్వానికి మొదట బలైంది మాత్రం పూనా ఫిలిం ఇన్స్టిట్యూట్... మహాభారత్ సీరియల్‌లో ధర్మరాజుగా నటించిన గజేంద్ర చౌహాన్‌ను ఛైర్మన్‌గా నియమించడాన్ని నిరసిస్తూ ఆరునెలలపాటు విద్యార్థులు బంద్ చేపట్టినప్పటికీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విద్యార్థులే వెనక్కు తగ్గవలసి వచ్చింది. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలపై ప్రభుత్వం దృష్టి సారించి, విద్యావిధానం భారతీయతకు అనుగుణంగా ఉండాలని అనేకమార్పులు, చేర్పులు చేయాలని ఉద్దేశించింది. అయితే ఐఐఎం, ఐఐటి, నిట్ విద్యాసంస్థల డైరెక్టర్లు వాటిని ఆమోదించలేదు. అప్పటి మానవవనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి విద్యాసంస్థలకు పెద్ద యుద్ధమే జరిగింది. విద్యాలయాలను కాషాయికరిస్తున్నారని విపక్షాలన్నీ విజృంభించాయి. అలాంటి నేపథ్యంలో హైదరాబాద్ జేఎన్‌యూ పరిశోధనా విద్యార్థి వేముల రోహిత్‌ను ఏబీవీపీ విద్యార్థి సంఘాలు లక్ష్యం చేసుకోవడం, డీన్ వారికి అనుగుణంగా రోహిత్‌ను మరో ఐదుగురిని సస్పెండు చేయడం జరిగింది. ఈ పరిణామంతో రోహిత్ ఉరి వేసుకొని చనిపోవడంతో విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ఢిల్లీలోని జేఎన్‌యూ విద్యార్థి సంఘ నాయకుడు కన్హయకుమార్‌పై కూడా ఇదే తరహాలో దేశద్రోహం కేసు నమోదు చేయడంతో వామపక్షాలు విరుచుకు పడ్డాయి. ఏబీవీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి నజీం అహ్మద్ ఆచూకీ ఇంతవరకు లభ్యం కాలేదు.

## ఆహారపు అలవాట్లపై హుకుం



ఆపై ప్రజల ఆహారపు అలవాట్లపై పడ్డారు. గోవు పవిత్ర జంతువని దాని మాంసం తినకూడదని మైనార్టీలను హింసించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అందుకు అనుగుణంగా శాసనాలను కూడా మార్చారు. రెచ్చగొట్టే ప్రసంగాలతో ఉత్తర ప్రదేశ్‌లోని దాద్రిలో ముస్లిం కుంటుంబంపై దాడి చేసి ఫ్రిజ్‌లో ఉన్న వేట మాంసాన్ని, గోమాంసంగా చెబుతూ అఖ్లాక్ అనే వృద్ధుడిని బలి తీసుకోవడం ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. అయితే రెండో రోజు ఫోరెన్సిక్ నివేదికలో అది గొర్రెమాంసంగా నివేదిక అందినా, బీజేపీ అనుబంధ సంస్థలైన ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు దాడుల నుంచి వెనక్కి తగ్గటం లేదు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, అసోం, జార్ఖండ్, గోవా, మహారాష్ట్రాల్లో గుజరాత్‌ల్లో పశుమాంసం అమ్ముతున్నారని ముస్లిం మహిళలను,దాడులు జరుపుతూనే ఉన్నారు. జమ్ములో లారీల్లో గోవుల తీసుకెళుతున్న వారిని బంధించిన, దాడి జరిపి చంపిన ఘటనలు కోకొల్లలు. అలాగే పశువుల కాపురులైన పిల్లలను కూడా వదలలేదు. వారిని చెట్టుకు ఉరి వేసి వారి పైశాచికత్వాన్ని ప్రదర్శించడం దేశ ప్రజలకు ఆవేదన మిగిల్చింది. చనిపోయిన ఆవుల చర్మాలను ఒలిచిన వారిని అధికార ప్రభుత్వ అనుబంధ సంస్థల కార్యకర్తలు వదలలేదు. వారిని దిగంబురులుగా చేసి బహిరంగంగా కొట్టి, హింసించడంతో ఉరివేసుకున్న ఘటన ఉనాలో జరిగింది. దాంతో దేశవ్యాప్తంగా ఉన్న మైనార్టీలు, దళితులు ఏకమయ్యారు. పరిస్థితి శృతి మించడంతో మోడీ మాట్లాడక తప్పలేదు. వారు కూడా మన సోదరులే అంటూ ముక్తాయించారు. మొత్తంమీద దేశంలో దాడులు మతజాడ్యానికి పరాకాష్టగా చెప్పవచ్చు. బీజేపీ ప్రభుత్వ అధికారంలో మైనార్టీలు, దళితుల వెతలు అప్పుడే వెలుగు చూశాయి.

## ఎక్కడ చూసినా ..నో క్యాష్ బోర్డులే..

### ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరం




నల్లధనానికి చోటు లేకుండా చేస్తున్నాం ఈ రోజు అర్థరాత్రి నుంచి పెద్దనోట్లను రద్దు చేస్తున్నామని నవంబరు 8న రాత్రి 8.30న ప్రధాని మోడీ ప్రకటించారు. అంతే అప్పటివరకు తిని, తినక రోగాలు, పెళ్లిళ్లు, చదువుల కోసం దాచుకున్న డబ్బును ఒక్క మాటతో విలువలేని చిత్తుకాగితాలుగా చేశారు. ఆపై వరుస క్యూలు, తొక్కిసలాట, ప్రజలంతా చలి, ఎండను ఖాతరు చేయకుండా పిల్లల్ని, ఉద్యోగాలను వదిలి వరుసల్లో నిలబడటం, దానిలో తొక్కిసలాట, గొడవలు, వారిని అదుపు చేయడానికి పోలీసులు, అసహనానికి గురై ఆడవాళ్లు, ముసలివాళ్లు అని కూడా చూడకుండా దారుణంగా లాఠీలకు పనిచెప్పడం జరుగుతోంది. విశేషమేమంటే నల్లధనం కల ఏ బడాబాబు బ్యాంకు గడప తొక్కలేదు. అయినా వారికి కోట్లకోట్లు కొత్తనోట్లు ఇళ్లకు వెళుతూనే ఉన్నాయి. సామాన్య మానవుడు మాత్రం తన విలువైన సమయాన్ని కోల్పోతున్నాడు. ఏటీఎం దగ్గర నిలబడితే రెండువేలు, బ్యాంకు వద్దయితే నాలుగు వేల కోసం జనం పడిగాపులు పడుతున్నారు. పెళ్లిళ్ల కోసం రూ. 2.5 లక్షల రూపాయలను ప్రభుత్వం ప్రకటించినప్పటికీ దేశం మొత్తం మీద ఇప్పటివరకు ఆ సౌకర్యాన్ని వినియోగించుకున్నది ఒక్కరు కూడా లేరు. బ్యాంకులు కూడా ఎవ్వరికీ ఆ నగదు అందించలేదనే తెలిపాయి. ఆర్‌బీఐ పూటకో ప్రకటనతో బ్యాంకు అధికారులను తికమక పెడుతోంది. ప్రధాని నిర్ణయంతో బ్యాంకుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నడూ లేని విధంగా రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా తన ప్రభావాన్ని కోల్పోయింది. సాదాసీదా వ్యాపారాలు, బ్యాంకు లావాదేవీలు, సామాన్యుడి జీవితం అతలాకుతలం అవుతోంది. ఫ్యాక్టరీ పరిశ్రమ, తాళాలు, చేతివృత్తులతో పాటు, రిక్షా, ఆటోల జీవితాలు కూడా దెబ్బతిన్నాయి. ఇదే పరిస్థితి నూతన సంవత్సరంలో కూడా కొనసాగుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

## ప్రశ్నిస్తే ...దేశద్రోహమే

భారీ మెజారిటీతో మోడీ ప్రభుత్వం గెలవంగానే దేశభక్తికి అర్థం మారిపోయింది. బీజేపీ పాలనను ఎవరు ప్రశ్నించినా దేశద్రోహులుగా ముద్రవేయడంలో ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ప్రభుత్వాలపై ప్రశ్నల వర్షం కురిపించిన హేతువాదులు దబోల్కర్, పన్సారే, కాల్బుర్గిలు బీజేపీ అనుబంధ సంస్థలు ఆర్ఎస్ఎస్ దాడులకు బలయ్యారు. దీంతో దేశం అంతటా నిరసనలు చెలరేగాయి. పాకిస్థాన్ రచయిత సుధీంద్ర కులకర్ణిపై శివసేన కార్యకర్తలు నల్ల ఇంకు పోసి అవమానించడంతో దేశంలోని అత్యున్నత రచయితలు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలంతా నిరసనగా, వారి అవార్డులను ప్రభుత్వాలకు తిరిగి పంపారు. ఈ ప్రక్రియతో అంతర్జాతీయంగా మోడీ అభాసుపాలయ్యారు. అంతేకాదు ఆయన అమెరికా పర్యటనల్లో కూడా విలేకరులు ఈ విషయంపై ఘాటుగా ప్రశ్నలు వేసారు. భారత్‌లో అసహనం నశించకపోతే తాము కూడా స్పందించాల్సి ఉంటుందన్నారు. దేశంలోని వామపక్ష పార్టీల పేపర్లు తప్ప మిగతావేవీ వీటిని ప్రచురించలేదు సరికదా మోడీకి ఎదురేలేదు.. అక్కడ ప్రజలంతా నీరాజనాలందుకున్నారు లాంటి వార్తలనే మొదటి పేజీల్లో ప్రచురించారు.

**- బోస్**

## లక్ష్యిత దాడులు మాగొప్పే...

పై సంఘటనలతో ప్రజల్లో దాగున్న అసంతృప్తిని, ప్రభుత్వంపై ఉన్న నిరసన నుంచి దృష్టి మళ్లించడానికి, లక్ష్యిత దాడులను ప్రజల్లోకి తెచ్చింది. దీనికి మరొక కారణం ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లకు దక్షిణ భారతంలోని కేంద్రపాలిత ప్రాంతం గోవా ఎన్నికలు కూడా. దీన్ని ప్రభుత్వం తమ ఘనకార్యంగా జమచేసుకుంటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. నిజానికి దేశాన్ని పాలించే అన్ని ప్రభుత్వాల హయాంలో సైనికులు విధిగా జరిపే చర్య అది... మొదటి ఓహో మోడీజీ ...అన్న ప్రజలే ఆపై ఉస్సూరన్నారు.

## ఆర్టీసీ సీసీఎస్ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం


పితాని వెంకటరమణ


నిమ్మకాయల కృష్ణమూర్తి

**రాజధాని ప్రతినిధి, కోనసీమ -జీఎన్.రావ్ :** ఏపీఎస్ ఆర్‌టీసీ సొసైటీ క్రెడిట్ కార్పొరేషన్(సీసీఎస్) ఎన్నికల్లో అమలాపురం డిపోలో ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) మరోసారి ఘన విజయం సాధించింది. డిశంబర్ 16వ తేది శుక్రవారం రాత్రి ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ ఎన్నికల్లో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఓటమి పాలైంది. ఈయూ అమలాపురం డిపో అధ్యక్షులుగా పితాని వెంకటరమణ, కార్యదర్శిగా నిమ్మకాయల కృష్ణమూర్తిలు రెండోసారి ఎన్నికయ్యారు. ఓట్ల లెక్కింపును పివెన్‌విఎంఎస్ఎన్.మూర్తి పర్యవేక్షించగా, మొహ్మద్ ఇబ్రహీం పోలింగ్ ఆఫీసరుగా వ్యవహరించారు. వీరితో పాటు పి.చంద్రశేఖర్, జెడి.రత్నంలు సహాయకులుగా ఉన్నారు. డిపోలో 503 ఓట్లు ఉండగా, 501 ఓట్లు పొలయ్యాయి. రెండు ఓట్లు చెల్లలేదు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పితాని వెంకటరమణకు 260, కార్యదర్శి నిమ్మకాయల కృష్ణమూర్తికి 249, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పి.ఎం.రాజాకు 239, పి.రాంబాబుకు 218 ఓట్లు, కార్మిక పరిషత్ నాయకులు ఎం.మోహనరావుకు 21, ఎం.ఎన్.మూర్తికి ఆరు ఓట్లు పోలయ్యాయి. ఇయు అధ్యక్షులు వెంకటరమణకు 21ఓట్లు, కార్యదర్శి కృష్ణమూర్తికి పది ఓట్లుమెజార్టీ లభించింది. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ ఎస్ఐ విజయశంకర్, సురేంద్రలు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేసారు. ఎంప్లాయిస్ యూనియన్ గెలుపుతో కార్మికులు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకుని మిఠాయిలు పంచారు. ఈయూ నాయకులకు పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమాలలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గుత్తుల విజయభాస్కరరావు, జిల్లా అధ్యక్షులు మేడిది శ్రీనివాసరావు, డిపో నాయకులు దొమ్మేటి రాధాకృష్ణన్, కూర్మాని వెంకటేశ్వరరావు, ఎండి.రజాక్, బిఎస్.మన్యం, జంగా నాగేశ్వరరావు, చిత్రపు ప్రసాద్‌లతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## 108 సేవలను అందరూ వినియోగించుకోవాలి

**రాజధానిప్రతినిధి, కోనసీమ -జీఎన్.రావ్ :** 108 అంబులెన్సు సేవలన ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని ముమ్మిడివరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తాడి జానకీరామ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించి గతంలో సమకూర్చిన అంబులెన్సు పాతబడిపోవడంతో దాని స్థానంలో కొత్త అంబులెన్సును ప్రభుత్వం సమకూర్చింది. ఈ అంబులెన్సును జానకీరామ్ ప్రారంభించారు. అలాగే 108 వాహన సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రభుత్వాసుపత్రిలో గదిని కేటాయించి చైర్మన్ రూ.20వేలు సొంత నిధులు వెచ్చించి వారికి కనీస వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యులు శిరీష, శాంతిలక్ష్మి, నాగరమ్య, 107, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు

### కార్మికనేత గల్లా రాము అభినందన



**రాజధాని ప్రతినిధి,కోనసీమ- జీఎన్.రావ్ :** కార్మిక సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి, కార్మిక నేత గల్లా రాము అభినందించారు. ఈ నెల 19వ తేదిన విజయవాడలో రాష్ట్ర లేబర్ కమీషనర్ కార్యాలయంలో కమీషనర్ వరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర కనీస వేతనాల సలహా సంఘం నూతన అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, నూతన సభ్యులు పదవీప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర కనీస వేతనాల సలహా సంఘం కార్యవర్గ సభ్యులను గల్లా రాము అభినందించారు. వెలగపూడిలో ముఖ్యమంత్రి కార్యాలయంలో డొక్కా మాణిక్య వరప్రసాద్ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి ఆయనకు అభినందనలు, జిల్లాలో రాజమహేంద్రవరం నుండి నక్కా చిట్టిబాబు, అమలాపురం నుండి కుసుమ సూర్యమోహనరావులను కమిటీలో సభ్యులుగా నియమించినందుకు గల్లా రాము ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఇరవై సంవత్సరాలుగా వివిధ కార్మిక సంక్షేమ బోర్డుల్లో సభ్యులుగా తనను నియమించనందుకు రాము ముఖ్యమంత్రి చంద్రబాబకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసారావుపేట ఎంపి.రాయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

## జమ్మే మిలాదున్నబీ కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



**వాహిద్, రాజధానిప్రతినిధి-గుంటూరు :** గుంటూరు డిసెంబర్ నెలలో సమస్త మానవళికి జీవితంలో నైతిక విలువలు దైవం పై భక్తి అందించిన మహనీయులు మహమ్మద్ సొల్లెల్లాహు అలైహివ సొల్లం అని గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది హాజీ సయ్యద్ నబీ జిలాని అన్నారు. రబీవుల్ అవ్వల్ నెల సందర్భంగా నిడుబ్రోలు లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో నబి జిలాని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పాఠశాలలో ఉర్దు ఉపాధ్యాయులు సయ్యద్ మహమూద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు వకృత్వ పోటీలు నాతేషరీఫ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పొన్నూరు చందోలు తదితర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఉర్దు ఉపాధ్యాయులు జబీవుల్లా, నజీర్ మెహక్ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిధి సయ్యద్ నబీ జిలానీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సంధర్భంగా నబీ జిలానీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ప్రధమంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అధ్యాత్మికత అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్న ఉర్దు ఉపాధ్యాయులు సయ్యద్ మహమూద్‌ను అభినందించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఉర్దు ఉపాధ్యాయులు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు షాహి జామియా మస్జీద్ పేష్ ఇమామ్ ముఫ్తి సమీవుజ్జమా హబీబీ, ముస్లిం మేధావుల ఫోరం అధ్యక్షులు షేక్ సలీమ్‌పాషా ఇంకా పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## నగర పంచాయితీ బడ్జెట్ అంకెల గారడీ

### ప్రతిపక్షత నేత రమేష్‌బాబు


రమేష్‌బాబు

**రాజధానిప్రతినిధి, కోనసీమ -జీఎన్.రావ్ :** ముమ్మిడివరం నగర పంచాయితీ వార్షిక బడ్జెట్ రూ.1 6.38 కోట్ల అంచనాలతో ప్రకటించి రూపొందించారు. బడ్జెట్ అంచనాలు అంకెల గారడీగా ఉందని ప్రతిపక్ష నేత వైసిపి చెందిన జనిపెల్ల రమేష్‌బాబు విమర్శించారు. బడ్జెట్ అంచనాలపై చర్చిస్తూ గత బడ్జెట్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని అయితే వాటిని ఎంతవరకూ ఖర్చు చేశారో చూపించాలని అన్నారు. బడ్జెట్ అంచనాలకు పరిమితమవుతుందని వారిలో ఎక్కడా అభివృద్ధి కనిపించడంలేదని విమర్శించారు.

## భారత్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో ఐ బ్యాంకుకు స్థానం




**రాజధానిప్రతినిధి,కోనసీమ -జీఎన్.రావ్ :** కోనసీమలోని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైన శ్రీయర్రా బలరామూర్తి కోనసీమ ఐ బ్యాంకు 1027 కార్నియాలు సేకరించిన సందర్భంగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాబ్ కార్లో చేతులుమీదుగా భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను నమోదు చేసిన సర్టిఫికెట్స్ ఐ బ్యాంక్ ఛైర్మన్ డా. యర్రా నాగబాబు అందుకున్నారు. విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కార్లో, ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రాజు లయన్స్ గవర్నర్ విఎస్ నూక రాజులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ స్థాయిలో ఇన్ని కార్నియాలు సేకరించడం అద్భుతమైన విషయని కార్లో అభినందించారు. అలాగే కార్నియాలు సేకరించి మరొకరికి చూపును ప్రసాదించడం వల్ల అంధుల జీవితాల్లో వెలుగును నింపవచ్చన్నారు. తూర్పు గోదావరి జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామంలో ఏర్పాటైన శ్రీయర్రా బలరామమూర్తి కోనసీమ ఐ బ్యాంకు ప్రారంభం నుండి 2016 వరకు 1027 కార్నియాలు సేకరించడం జరిగిందని నాగబాబు తెలిపారు. దీనికి గుర్తింపుగా భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుచేసి సర్టిఫికేట్ అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిఎస్ రాజు, విఎస్ వర్మ, ఎల్ కృష్ణమూర్తి, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, మాకినీడు పూర్ణిమ, లంక సన్ని, పేరాబత్తుల దుర్గ తదితరులు ఉన్నారు.


| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| నవీన్ దేశాయ్, శాన్‌ఫ్రాన్సికో | కె.వాసు, హుస్టన్ | రాంబాబు, ఫ్లోరిడా | అఫ్జర్‌ఖాన్, వాసా | రెహమాన్, సియాటిల్ | హరీష్, లివర్‌మోర్ | నర్సి, సాన్‌జోసే | నజర్, శాన్‌ఫ్రాన్సిస్కో | ఆబిద్, న్యూయార్క్ | అబ్రార్, ఆల్‌బర్ట |
| సల్మాన్, జిద్దా | పాండే, న్యూఢిల్లీ | గోపాల్, చెన్నై | నవరాజ, బెంగుళూరు | అజర్, బెంగుళూరు | చాంద్‌భాషా, గుంటూరు | మోయినుద్దీన్, గుంటూరు | రవికుమార్ విజయవాడ | అలీమ్, లబ్బీపేట | హుస్సేన్‌ఖాన్, రాయపూడి |
| వెంకటరెడ్డి, ఏలూరు | దస్తగిరి, తుళ్ళూరు | రఘు, బెంగుళూరు | ముఫ్తీ ఫారూక్, విజయవాడ | స్వర్ణభారతి, విజయవాడ | ప్రసాద్, మందడం | ఖాదర్, రాయపూడి | కాషాని, రాయపూడి | ఆయుబ్‌ఖాన్, రాయపూడి | నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మీ ఫ్రెండ్స్ |
| బద్రి, తుళ్లూరు | సుబ్బు, విజయవాడ | జాన్‌ఖాన్, రాయపూడి | భాస్కరరావు, హైదరాబాద్ | వినీత్, న్యూఢిల్లీ | సలీంఖాన్, రాయపూడి | ముప్పాల, వైజాగ్ | చాంద్‌బాషా, మాల్కాపూర్ | వేణు, నూజివీడు | |




# రంగులు మారుతున్న రాజకీయాలు

## ఆత్మాభిమానం లేని రాజకీయ నాయకులు

తమిళనాట సాంఘిక సంస్కరణల పితామహుడిగా పేరుతెచ్చుకున్న ఈవీ రామస్వామి పెరియార్ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, వ్యక్తి ఆరాధనకు వ్యతిరేకంగా, కులమతాల అడ్డుగోడలను పగలగొట్టి, సమానత్వం చాటి చెప్పే ప్రయత్నంగా ఆత్మగౌరవానికి ప్రతీకగా, ద్రవిడ కజకం (డీఎం) పార్టీని స్థాపించారు. అంటరానితనం అరికట్టి మహిళాభ్యుదయం కోసం వనితా విద్యను ప్రోత్సహించారు. డెబ్బై ఏళ్ల వయస్సులో 32 ఏళ్ల అమ్మాయిని పెళ్లి చేసుకుని ఆమెకు పార్టీ పగ్గాలు అప్పగించాలని ప్రయత్నిస్తుండటంతో ఆ పార్టీ నుంచి కంజీరం నటరాజ అన్నాదురై వేరయ్యారు. దీంతో ఆయన ద్రవిడ మన్నేట్ర కజకం (డీఎంకే) పార్టీని 1949 సెప్టెంబరు 17న నెలకొల్పారు. తమిళనాడు సూపర్ స్టార్ ఎంజీ రామచంద్రన్ 1953లో అన్నాదురై పార్టీలో సభ్యత్వం పొందారు. 1969లో అన్నాదురై మరణించిన తర్వాత కరుణానిధి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికవ్వగా, నెందున్‌చెజియన్ ప్రధానకార్యదర్శిగా, రామచంద్రన్ కోశాధికారిగా ఉన్నారు. ఆతరువాత ఎదురైన పరిస్థితుల్లో తమిళనాట అచంచల అభిమానులను సాధించుకున్న రామచంద్రన్ డీఎంకే నుంచి వేరై ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజకం (ఏఐఏడీఎంకే) పార్టీని స్థాపించారు. కాగా కరుణానిధి డీఎంకేకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే వీరిద్దరూ చిత్ర పరిశ్రమకు చెందినవారే.. రామచంద్రన్ సూపర్ స్టార్‌గా ఎదగ్గా, కరుణానిధి మంచి స్క్రీన్‌ప్లే రచయితగా పేరొందారు. వారిద్దరి సారథ్యంలోని రెండు పార్టీలు అప్పటి నుంచి ఇప్పటివరకు తమిళనాడును ఏలుతున్నాయి.. రామచంద్ర వారసురాలిగా జయలలిత పార్టీని హస్తగతం చేసుకోగా, ప్రస్తుతం దాన్ని జయ నిచ్చెలి శశికళ తీవ్ర విమర్శలు ఎదురైనప్పటికీ పార్టీ అధ్యక్షురాలిగా, ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం కోసం ఒక్కొక్క పావూ కదుపుతూ తమిళ రాజకీయాలను తన గుప్పెట్లోకి తెచ్చుకుంటున్నారు. ఏ పార్టీ అయితే ఆత్మగౌరవం కోసం ఆవిర్భవించిందో అదే పార్టీ ఇప్పుడు వ్యక్తులకు పూజారులుగా మారిపోయింది. అక్కడ ప్రజలు, నాయకులు విపరీతమైన వ్యక్తి పూజలు చేస్తున్నారు. భజనపరులే ఆపార్టీలో పదవులు అనుభవిస్తున్నారు. శశికళపై తమిళ ప్రజల కున్న అనుమానాలు సామాన్యమైనవి కావు... ఆమె జయలలితకు తప్పుడు మందులు ఇచ్చారని, కుట్రతో చంపారని, అపోలో ఆసుపత్రిలో



జయలలితను రాజకీయ నాయకులను, బంధువులను చూడకుండా చేశారని ప్రజలు నమ్ముతున్నారు. అంతేకాదు..అమెరికాకు చెందిన లీజియన్ సంస్థ జయలలితకు చికిత్స నందించిన అపోలో ఆసుపత్రి మెయిల్స్‌ను హ్యాక్ చేశామని చెప్పింది. అందులో భాగంగా ఎన్‌డీటీవీకి చెందిన రిపోర్టర్ బర్ఖాదత్ వ్యక్తిగత మెయిల్స్‌ను కూడా హాక్ చేసి ఆమె తన అంతరంగికులకు చేసిన మెయిల్ సారాంశాన్ని బహిర్గతం చేశారు. జయలలితకు ఇంట్లోనే బీపీ, షుగర్ మందులకు బదులు వేరే వేసారని, దాంతో అవి విషంలా ఆమెకు పనిచేశాయని అపోలో డాక్టర్ ఒకరు ఆమెకు తెలిపినట్టు రిపోర్టర్ తన వ్యక్తిగత మెయిల్‌లో తెహల్కా జీమెన్‌జాల్‌కు తెలియచేశారు. నిజానికి శశికళ వల్లే కోర్టు కేసుల్లో (అక్రమ ఆస్తుల) ఇరుక్కున్నారని, ఆమెను తొలగించుకోవాలని అనేక మంది చెప్పినట్లు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వారిలో ఎన్‌టీరామారావు, ప్రస్తుత ప్రధాని మోడీ, కర్ణాటక డీజీపీలు ఉన్నారు. 2011లోనే ఆమెపై విషప్రయోగం చేయటానికి ప్రయత్నించారని జయలలిత ఆమెను ఇంటి నుంచి గెంటి వేశారని, జయలలిత ఒక పనివానిగా శశికళను చూశారుతప్ప ఆమెకు పార్టీపరంగా ఎటువంటి బాధ్యతలు అప్పచెప్పలేదని తమిళ ఎంపీ శశికళా పుష్ప తెలిపారు. మన్నార్‌గుడి మాఫియా (శశికళ సొంత ఊరు) మూలంగానే జయలలిత ఆసుపత్రి పాలయ్యారని, శశికళ పుష్ప సుప్రీంకోర్టులో కేసువేశారు చనిపోయినా మృతదేహం పాడవ్వకుండా ఉండటానికి ఇచ్చే ఇంజెక్షన్లు ఇచ్చారనటానికి చెంప దిగువ భాగాన గుర్తులు ఉన్నాయి. అపోలో ఆసుపత్రి వర్గాలు ఆమె కాళ్లు తొలగించారని కూడా సోషల్‌మీడియాలో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఏది ఏమైనా జయలలిత పార్థివ దేహం ఆసుపత్రిలో ఉండగానే ఆమె రాజకీయాల్లో తన ఆధిపత్యం కోసం ప్రయత్నించారన్నది నిజం. ఆమె పార్టీ పగ్గాలనేకాదు, అధికారాన్ని కూడా స్వంతం చేసుకుంటానికి పావులు కదుపుతున్నారు. త్వరలో ఆమె జయలలిత స్థానాన్ని చేజిక్కించుకునే అవకాశం కనిపిస్తోంది. ఆత్మాభిమానం కోసం ఏర్పాటు చేసిన పార్టీల్లో ఆత్మాభిమానం లేనివాళ్లతో నిండిపోవడం విచారకరం...

– ఖాన్

# భారత్ ఘనవిజయం

భారత్-ఇంగ్లాండ్‌ల మధ్య జరిగిన అయిదు టెస్ట్‌ల సిరీస్ ముగిసిన తర్వాత ఒక టి.వి.వ్యాఖ్యాత "భారత్ ఆట తీరును ప్రశంసించటానికి మన భాషలో మాటలు చాలవు" అంటూ వ్యాఖ్యానించారు. అక్షర లక్షల విలువైన అభిప్రాయం అది. నిజమే! భారత్ ఆటగాళ్ళు ఈసిరీస్‌లో ఎన్నో రికార్డులు సృష్టించారు. చివరి రోజు ఆటనే సమీక్షించు కొంటే ఎన్నో నమ్మశక్యంలేని విషయాలు మనకు గోచరిస్తాయి. అంతకుముందు రోజు ఇంగ్లాండ్ రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించి, వికెట్‌నష్టపోకుండా ఆరోజు ఆటను ముగించింది. భోజన విరామం సమయానికి కూడా భారత్ బౌలర్లు వికెట్ సాధించలేకపోయారు. తొలిసెషన్ పూర్తయ్యే సరికి ఇంగ్లాండ్ స్కోర్ 97 పరుగులే డ్రా చేసుకొని, పరువు నిటబెట్టుకోవాలనే దిశగానే ఇంగ్లాండ్ ఓపెనర్లు ఆటను కొనసాగించారు. కుక్, జెనింగ్స్ లు అవుటయ్యే అవకాశం వచ్చినా భారత్ ఆటగాళ్ళు సద్వినియోగం చేసుకోలేక పోయారు. 32 ఓవర్లు బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేని భారత్ బౌలర్లు మిగిలిన రెండు సెషన్‌లలో 10 వికెట్లు కూల్చటం కష్టమే! నని భారత్ అభిమానులు కూడా పెదవి విరిచారు. లంచ్ తర్వాత ఎనిమిది పరుగులు సాధించిన ఇంగ్లాండ్ పతనం ప్రారంభమైంది. 103 పరుగుల వద్ద కుక్, 110 వద్ద జెన్నింగ్‌ల వికెట్లు పడగొట్టారు. స్పిన్నర్ రవీంద్రజడేజ ఇంగ్లాండ్‌లో వికెట్ల పతనం ప్రారంభమైంది. జడేజా ఒక్కడే ఏడు వికెట్లు పడగొట్టటమే అయిదు టెస్ట్



ఇన్నింగ్స్ 75 పరుగుల తేడాతో భారత్ గెలవటానికి కారణమైంది. ఆదివారం ఆట ప్రారంభించి సోమవారం కూడా కొనసాగించి, ఇంగ్లాండ్ బౌలింగ్‌ను తుత్‌నియలు చేసిన యువ బ్యాట్స్‌మన్ కరుణ్ నాయక్ ఏకంగా ట్రిపుల్ సెంచరీ సాధించినా అంతకు ముందు రాహుల్ 199 పరుగులు సాధించి భారత్ ఇంగ్లాండ్‌కు అందనంత ఎత్తులో నిలిపినా, డ్రాగా ముగించాలనే ఇంగ్లాండ్ ఆశలు అడియాశాలు చేశారు జడేజ.

ఇంగ్లాండ్‌పై భారత్ ఇది అతిపెద్ద విజయం 1993లో అజరుద్దీన్ నాయకత్వంలో 3.0తో సిరీస్‌ను కైవసం చేసుకొంది. 2016 ముగింపుతో విరాట్ కోహ్లీ నాయకత్వంతో 4.0తో సిరీస్‌ను స్వంతం చేసుకొంది. టెసు 14 టెస్టు విజయాలు అందించిన అజరుద్దీన్ సరసన ఇప్పడు వీరాట్ కోహ్లీ చేరారు. వీరిద్దరికన్నాముందు ధోనీ 27తోను, గంగూలీ 24తోను ముందున్నారు. 2016లో స్వదేశంలో 12 టెస్టులు ఆడిన భారత్ మొత్తం విజయలనుందుకొంది. 2015-16 భారత్ జట్టు 18 టెస్టులు ఆడింది. మొత్తం తన కాతాలోకి చేర్చుకొంది. 1985-87 మధ్యకాలంలో 17 టెస్టులోబడిన భారత్ మొత్తం తన ఖాతాలోకి చేర్చుకొన్న రికార్డులను అధికమించబడింది. ప్రస్తుతం భారత్ జట్టు కెప్టెన్ వీరాట్ కోహ్లీ సారధ్యంలో 18 మ్యాచ్‌లు ఆడి, మొత్తం విజయలుగా మార్చుకొంది. 1977-78లో అప్పటి కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా 18 మ్యాచ్‌లాడి, విజయాలు అందుకొన్న రికార్డును ఇప్పడు కోహ్లీ అందుకొన్నారు. ఇంగ్లాండ్ పై భారత్‌కి ఇదే పెద్ద విజయం. 2002లో లీడ్స్‌ల్ లో జరిగిన పోటీలో ఇన్నింగ్స్ 46 పరుగులతో భారత్ గెలిపించారు. ఇపుడు ఇన్నింగ్స్ 75 పరుగుల - దాన్ని పెంచారు.

భాతర టెస్ట్ జట్టులో సీనియర్ ఆటగాళ్ళు చాలా వరకు దూరమైనదశలో "కుర్రాళ్లు ఏవిధంగానెగ్గుకొస్తారు? భారత్ పరువును ఏవిధంగా కాపాడుతారు? అంటూ పలువురు క్రీఢాభిమానులు సంశయించిన మాట అక్షరసత్యం. ఉడుకు రక్తంతో ఉరకలు వేస్తున్న యువ ఆటగాళ్ల అసంశయాలను పటాపంచాలు చేస్తూ, భారతవరుస విజయాలు అందించటం శుభసూచకం. సమిష్టి పోరాటమే ఈ వరుస విజయాలకు కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చు. గతకాలపు ఆటకు ఇప్పటి ఆటకు కొంచెం తేడా స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో బౌలర్లు బ్యాట్స్‌మన్‌లుగా రాణించటం అరుదుగా కనిపించేది. ఇప్పుడలా కాదు. ఇప్పటి బౌలర్లలో ఎక్కువ భాగం బ్యాట్ కూడా ఝుళిపించి పరుగులు రాబట్టుకొంటున్నారు. అందుకు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్రజడేజాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బౌలర్లు కూడా బ్యాట్‌లతో రాణించిన ప్రతి జట్టు ఉన్నత విజయాలను అందుకుంటుందని క్రికెట్ పండితులు అభిప్రాయపడుతుంటారు. భారత జట్టు విషయంలో అర అక్షర సత్యమని రుజువవుతుంది. ఇంగ్లాండ్ పై 4.0 తో సిరీస్ కైవసం చేసకొన్న భారత జట్టు సాంధించి విరాట్‌కోహ్లీ " మాన్‌ఆఫ్‌ది సిరీస్. అవార్డును అందుకొన్నారు. భారతీయ ఆటగాళ్ళలో ట్రిబుల్ సెంచరీ సాధించిన కరుణ్‌నాయర్. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొన్నారు. 2017 లో ఇంతకు మించి విజయాలు భారత్‌జట్టు స్వంతం చేసుకుంటుందని ఆశిస్తూ నూతన సంవత్సరం స్వాగతం పలుకుతాం!

– కె.వి.ఎస్.డి. ప్రసాద్

## పీసీసీ క్రమశిక్షణా సంఘం సభ్యునిగా మాజీ ఎమ్మెల్సీ



**రాజధాని ప్రతినిధి , కోనసీమ -జిఎస్.రావ్ :** పీసీసీ క్రమశిక్షణా సంఘం సభ్యుడిగా మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి నుండి ఆయనకు ఉత్తర్వులు అందాయి. కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం సభ్యుడిగా పార్టీ ప్రతిష్టతకు తన వంతు కృషి చేస్తానని అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## క్రిస్మస్ పర్వ దినం - ప్రపంచానికి రక్షణదినం



క్రీస్తు జననం డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు దానిని క్రిస్మస్ పండుగా ఆచరిస్తారు. క్రీస్తు జననం ఒక చారిత్రిక సత్యం. ప్రపంచ చరిత్రకే ఒక కొలమానంగా మారిన ఘటన. 2000 సం॥రాల పూర్వాన్ని క్రీస్తు పూర్వం అని ఆ తరువాత దానిని క్రీస్తుశకము అని నిర్వచిస్తాము. క్రీస్తు కొరకు యావత్ ప్రపంచం కళ్ళల్లో వొత్తులు వేసుకొని ఎదురు చూచింది. కన్య అయిన మరియ గర్భాన రొట్టెల గ్రామమైన బేత్లేహేము నందు ఒక పశువుల పాకలో జన్మించాడు. ఆయనకు పూజించాలని బయలుదేరిన జ్ఞానులు ముగ్గురు, అప్రాంతంలో పశువులు,గొర్రెలు మేపుకొనే పామరులు, దైవదూతలు ఆయనకు సందర్శించి ఆయనను ఆరాధించారు.క్రిస్మస్ అంటే క్రీస్తుకు ఆరాధించుట, అనుసరించుట. పుట్టునరోజు అందరం జరుపుకొంటాం. కాని దాని అర్థాన్ని చాల మంది గ్రహించరు.క్రీస్తు మనకై ఉదయించిన వెలుగు. మనకు విమోచనకర్త. మన పాపముల పరిహారంగా దేవునికి అర్ధించబడిన గొర్రె పిల్ల." ప్రయాస పడి భారము మోయు సమస్త ప్రజలారా! నా వద్దకు రండి.నేను మీకు విడుదల అనుగ్రహిస్తాను" అని క్రీస్తు వాగ్దానం ఇచ్చాడు. మనకు ఏది మంచిదో, ఏది అవసరమో దాన్ని ఆయన మనకు అనుగ్రహిస్తారు. ఆయన సమాధాన కర్త, దేవునికి మనకు సంధాన కర్త, మనకు విమోచన కర్త, క్రైస్తవత్వ మంటే ఏమిటో మదర్‌థెరిస్సాను చూచి మనమందరమూ గ్రహించవచ్చు. భారత దేశంలో మహాత్మాగాంధీ, మదర్‌థెరిస్సా క్రీస్తు వలన స్ఫూర్తి పొందారు. వారి పరిచర్య క్రమ శిక్షణ మనము కూడ నేర్చుకొని క్రీస్తుకు మాదిరిగా జీవించాలి అట్టి మనస్సును గ్రహింపును భగవంతుడు మనకు అనుగ్రహించాలని ప్రార్ధించుదాం.

– గంజి. పీటర్ సాల్మన్ రాజ్
ఎం.ఏ. ఎం.ఈ.డి.

## నోట్ల రద్దు ప్రజా దోపిడి

### ఫోర్బ్స్ పత్రిక సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నవంబరు 8వ తేదీన పెద్ద నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న ఆకస్మిక నిర్ణయంపై ప్రముఖ మ్యాగ్‌జైన్ ఫోర్బ్స్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అనైతికమని, ప్రజల సొత్తును దోచుకోవడమేనని తీవ్రంగా ధ్వజమెత్తింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం తీసుకున్న దిగ్భ్రాందికర చర్యగా పేర్కొంది. ప్రజల ఆస్తులను భారీగా దొంగిలించడమేనని ఫోర్బ్స్ విమర్శించింది. 1975-77 లో ఎమర్జన్సీ కాలంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేపట్టిన బలవంతపు కుటుంబ నియంత్రణ కార్యక్రమంతో ఈ నిర్ణయాన్ని పోల్చింది. పెద్ద నోట్లు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం భారతదేశం ఆర్థికవ్యవస్థను, భవిష్యత్ పెట్టుబడులను దెబ్బతీసిందని ఫోర్బ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ స్టీవ్ ఫోర్బ్స్ పేర్కొన్నారు. కరెన్సీ రద్దు చేయడం అంటే సామాన్యుడి గోప్యతపై దాడిచేయడమన్నారు. ప్రభుత్వం చర్య ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా కోట్లాదిమంది పేదల్ని మరింత భయాందోళల్లోకి నెట్టివేసిందనీ, ఇది అనైతికమని పేర్కొన్నారు. కరెన్సీ రద్దు చేసినంత మాత్రాన టెర్రరిస్టులు తమ దుర్మార్గపు పనులను వదిలి పెట్టరని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛా మార్కెట్లకు అనుమతి ఉంటేనే నోట్ల రద్దు సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఎలాంటి ముందుస్తు హెచ్చరికలు లేకుండా 85 శాతం చలామణీలో ఉన్న నోట్లను రద్దు చేసి, సామాన్య ప్రజానీకాన్ని అత్యంత ఇబ్బందుల్లోకి నెట్టివేసిందన్నారు. తాజా ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధమైన వ్యాపారాన్ని సులభతరం చేసి వ్యాపార అవకాశాలను మరింత అందుబాటులోకి తేవాలన్నారు. మొత్తం పన్నుల మరింత తగ్గించాలని మ్యాగజైన్ సూచించింది. పన్నుల ఎగవేతకు పరిష్కారంగా ఎంత తక్కువ పన్ను రేటు ఉంటే అంతమంచిదని తెలిపింది. దేశీయ కరెన్సీని మరింత బలోపేతం చేయాలని కోరింది.



# జెండా ఊంచా రహే హమారా...




మువ్వన్నెల జాతీయ జెండా మన ప్రతిష్టకు, గౌరవానికి, దేశ సార్వభౌమత్వానికి ప్రతిరూపం. ఆసేతు హిమాచలం నుంచి కన్యాకుమారి వరకు, 125 కోట్ల మంది భారతీయులను ఏకతాటిపై నిలిపే అస్త్రం మన జాతీయ గీతం...

స్వాతంత్ర్య పోరాటంలో మనకంటూ ఒక జెండా ఉండాలని ఆనాటి బ్రిటీషు వనిత అని బిసెంటు గాంధీమహాత్ముడిని కోరగా ఎందరో మహానుభావులు రూపొందించిన జెండాను కాదని మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య దాన్ని రూపొందించారు. ఆ జెండా కోసం ఎందరో యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించారు.

జాతీయ జెండాలో కనిపించే మూడు వర్ణాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. కాషాయం రంగు శౌర్యానికి, త్యాగానికి,ఆధ్యాత్మికతకు గుర్తు కాగా తెలుపు రంగు వెలుగు, సత్యం, శాంతి, స్వచ్ఛతకు గుర్తుగా రూపొందించారు. ఆకుపచ్చ రంగు సస్యశ్యామలానికి, సాఫల్యతకు, అభివృద్ధికి చిహ్నంగా ఉంది. తెలుపురంగు మధ్యలో ఉన్న చక్రాన్ని సారనాథ్‌లోని అశోకుడి స్థంభం నుంచి తీసుకున్నారు. ఇది చట్టానికి, న్యాయానికి, శాంతియుతమైన చైతన్య ప్రగతికి చిహ్నంగా భావిస్తున్నాం.

అమెరికా జాతీయ జెండాను చెప్పుల మీద, టీషర్టులపై, తలకు చుట్టుకునే గుడ్డగా ఎలా అయినా ఉపయోగించే స్వేచ్ఛ వారికుంది. అయితే మన జాతీయ జెండాను ఇతర దేశాల మాదిరిగా ఎక్కడపడితే అక్కడ ఎలాగైనా ఉపయోగించేందుకు వీలులేదు. 1951లో జాతీయ జెండాకు కొన్ని నిర్ధేశికాలను రూపొందించింది. 1964,68ల్లో కూడా మరోసారి నిర్ధేశాలను సవరించారు. పతాక పరిమాణం రంగులు, వాడే బట్టలకు వర్తించే ఈ నిర్ధేశికాలు, చాలా ఖచ్చితంగా అమలు చేస్తారు. వీటి ఉల్లంఘన శిక్షార్హమైన నేరం. పతాక తయారీకి చేనేత వస్త్రాన్ని మాత్రమే వాడాలి. దేశం మొత్తం మీద జెండాను ఖచ్చితంగా రూపొందించేవారు కేవలం పదిమందే ఉన్నారని పండితులు చెబుతున్నారు. ఇదివరకు కేవలం జాతీయ పండుగ దినాల్లోనే దాన్ని ఎగురవేసే వీలుండేది.

పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ ప్రజలందరూ జాతీయభావంతో ఎగురవేసేందుకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్) వేశారు. అంతేకాకుండా తన ఆఫీసు భవంతిపై ఎగరవేయడం భారతీయుడిగా తన హక్కని చాటారు. దేశంమీద ప్రేమ ప్రకటించే మార్గమని కోర్టులో వాదించడంతో ఆ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. పతాక గౌరవానికి భంగం కలిగించకుండా ఎవరైనా జాతీయ పతాకాన్ని ఎగురవేయవచ్చని తీర్పు వెలువరిస్తూ, జాతీయ పతాక నియమావళిని సుప్రీంకోర్టు సవరించింది. ఇది 2002 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. భారత రాజ్యాంగంలోని 51ఏ ఆర్టికల్ లోని ప్రాధమిక విధులతో కలిపి అన్వయించింది.

రాజ్యాంగంలోని 19వ నిబంధన ప్రకారం యూనిఫారాలపైన, ఇతర వస్త్రాలపైన జెండా వినియోగాన్ని చట్టం తీవ్రంగా పరిగణిస్తుంది. చేతిరుమాలు, దిండు గలేబులపై కూడా ఎంబ్రాయిడరీ చేసిన జెండాను వినియోగించకూడదు. అంతేకాదు... పాడైపోయిన జెండాలను కూడా అగౌరవంగా పడేయకూడదు. వాటిని గొయ్యితీసి పాతివేయడమోలేదా, తగలబెట్టడమో చేయాలి. ఎందుకంటే అది ప్రతి భారతీయుడి ప్రతిష్ట గనుక, అంతేకాదు జాతీయ జెండా ఒక పవిత్ర భావన, అది స్వాతంత్ర్య సమరయోధుల్ని, జాతీయ నాయకుల్ని, ఈ దేశం కోసం సర్వస్వాన్ని ధారపోసిన మహాను భావులను గుర్తు చేస్తుంది... దేశభక్తిని, ఉన్నత భావాలను, సదాశయాలను ఉద్భోదించే సినిమాలేవీ ఇప్పుడు రావడంలేదు. సినిమాలు పక్కా వ్యాపారం, అందునా యువతరం బలహీనతలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకునే వారే ఎక్కువ. ఆరేసుకోబోయి...పారేసుకున్నాను... ఐలవ్ బ్యాడ్ బోయ్స్ లాంటి ఐటం సాంగ్స్‌తో నిండిఉండే సినిమాల ప్రదర్శనకు ముందు థియేటర్లలో జాతీయ గీతం ఆలపించడం ...సరైందే అంటారా ? దాని బదులు పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమంత్రుల కార్యక్రమాల ముందు సర్వోన్నతమైన జాతీయ గీతం ఆలపిస్తే సగర్వంగా ఉంటుందని భావిస్తున్నాం...

– సన

## ఐలాచైర్మన్ పదవికి ఆట్టోమ్మొబైల్ బాడిబిల్డర్ సాదిక్ సిద్ధం



రాజధాని ప్రతినిధి, విజయవాడ : రాష్ట్రంలోని , అత్యంత ప్రతిష్టాత్మకమైన విజయవాడ ఐలా సొసైటీకి (ఇండిపెండెంట్ లోకల్ ఆథారిటీ) జనవరి 2017లో ఎలక్షన్లు జరగవచ్చునని ఆటోనగర్ షాపు యజమానులు తెలిపారు. వివిధ వర్గాల నుండి సేకరించిన సమాచారం ప్రకారం ఐలా సొసైటీకి జరిగబోయే ఎన్నికల్లో అటోమొబైల్ బాడీబిల్డర్ సాదిక్ చైర్మన్ పదవికి పోటీ చేయనున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్ధికు అందరికీ సుపరిచితులు, నిగర్వి ప్రజల కష్ట నష్టాలలో నిరంతరం వెన్నంటి ఉండే ఎమ్.డి. సాదిక్ పోటీ చేయాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. ప్రజా అభిమానం ఎక్కువగా గల సాదిక్ ఆటోనగర్‌లోని ప్రముఖులు,పెద్దలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఫేస్1, ఫేస్2 సభ్యులు, పన్ను చెల్లింపు దారులు ఆటోనగర్‌లోని షాపు యజమానులు,కార్మికులు అందరినీ కలుపుకుని విస్తృతంగా ప్రచారం చేయబోనున్నారని తెలిసింది. ఐలా ఏర్పాటుకు విశేష కృషి చేసిన ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) మద్దతు ఎం.డి.సాధిక్ కే ఉందని తెలిసింది. ఐలా చైర్మన్ పదవి ఆయనకు వరిస్తే అందరికి అందుబాటులో ఉండే నాయకుడని ఆటోనగర్‌లోని అన్ని వర్గాల వారి సంక్షేమానికి కృషి చేయగలరని ప్రజలు అనుకుంటున్నారు. ఆటోనగర్ టెక్నీషియన్ అసోసియేషన్స్, ఆటోనగర్‌లోని ప్రముఖులు, ఇండస్ట్రీ, ఎస్టేట్‌లోని ఫేస్-1,ఫేస్-2 లోని సభ్యులు, ఆటోనగర్‌లోని టాక్స్‌పేయర్స్, అన్ని పాలక వర్గంలోని సభ్యులు మద్దతు ఇచ్చి సాధిక్‌ను సునాయాసంగా గెలిపిస్తారని కథనం. ఐలాలోని పాలక వర్గం సభ్యులను కూడా త్వరలోనే ప్రకటిస్తారని తెలుస్తోంది. సాదిక్ అందరికీ అందుబాటులో ఉంటారని, మంచి సహాయ సహకారాలు అందించే ఉత్తమ వ్యక్తి అని స్థానిక ఆటోనగర్‌లోని సంస్థల ప్రతినిధులు తెలుపుతున్నారు.

## రైతుల భూములు కారు చౌకగా కార్పొరేట్ల పరం

- మొన్న 'విట్'... నేడు 'షెట్టి'
- రైతుల భూముల్లో విదేశీ వర్సిటీలు
- కారుచౌకగా భూములు కేటాయింపు

**రాజధాని ప్రతినిధి,(అమరావతి) :** అమరావతిలో అబుదాబి పాగా వేస్తోంది. 'వైద్యం-వైద్య' విద్య, పరిశోధనల' పేరుతో వంద ఎకరాలకు అసామిగా మారింది. అబుదాబిలోని బి.ఆర్ షెట్టి యెడికల్ హెల్త్ కేర్ రీసెర్చ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థకు ఏపీ ప్రభుత్వం బేషరతుగా వంద ఎకరాలను కేటాయించింది. ఎకరాను కేవలం 50 లక్షల రూపాయలకు ఆ సంస్థకు అమ్మేసింది. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ భూమి ధర నాలుగు కోట్ల రూపాయల పై మాటే, ఇప్పటికే వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)కి రెడ్‌కార్పెట్ పరిచినా రాష్ట్ర ప్రభుత్వం ఇపుడు విదేశీ కార్పొరేట్ వైద్య విద్యాసంస్థలను కూడా అక్కువ చేర్చుకుంటోంది. బి.ఆర్ షెట్టి సంస్థ అమరావతిలో 100 ఎకరాలను 50 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. నిజానికి ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్లో ఎనిమిది రెట్లు ఎక్కువ. అంటే ఎకరా నాలుగు కోట్లు రూపాయలుంది. తమకు కేటాయించిన వంద ఎకరాల్లో ఆ సంస్థ మొత్తం 11 ప్రాజెక్టులను నిర్మించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో వెల్లడించింది. వైద్య విశ్వవిద్యాలయం, 750 పడకలతో కూడిన సాధారణ ఆసుపత్రి, 200 పడకల సామర్థ్యం ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, మూలకణ విభాగం, నాలెడ్జి ప్రాసెసింగ్ అవుట్ సోర్సింగ్, వైద్య పరికరాల ఉత్పత్తి కేంద్రం, 100 సర్వీస్ అపార్ట్ మెంట్లు, యోగ, నేచురోపతి కేంద్రం , క్వాంటమ్ అనలైటిక్ సెంటర్, మూడు నక్షత్రాల హోటల్, ఐబీ స్కూల్ నిర్మాణాలు చేపట్టాలి. వీటిలో వైద్య పరికరాల ఉత్పత్తి కేంద్రాన్ని 2019లో ప్రారంభించేలా, మిగతావన్నీ 2018 నాటికి పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించింది. ఆ సంస్థ నిర్మించే ఆసుపత్రుల్లో అయిదు శాతం పడకలను తెల్ల రేషన్ కార్డుదారులకు కేటాయించాలనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉచితం వైద్యం అందించాలని షరతు విధించింది. ప్రయివేట్ విశ్వవిద్యాలయాల చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ప్రపంచంలో అగ్రశ్రేణిగా ఉన్న 25 యూనివర్సిటీల్లో ఎవరితోనైనా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకునే వెసులుబాటును ఆ సంస్థకు కల్పించారు. రాజధాని పేరుతో పూలింగ్ పద్ధతిలో ఏడాదికి మూడు పంటలు పండే మాగాణి భూములను రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ సిటీ పేరుతో వాటిని కారుచౌకగా విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టటం పై సర్వత్రా విమర్శలు పెల్లుబికుతున్నాయి. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో, రాజధాని నగరంలో ఉన్నత విద్యనూ, వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసి కార్పొరేట్ సంస్థలకు భూములు దారాదత్తం చేయడం ఎంతవరకు సబబన్న ప్రశ్నలకు సమాధానం చేప్పే నాథుడే కరువయ్యాడు. దేశీయంగా ఎయిమ్స్ ఉంది. మన పొరుగు రాష్ట్రాల్లో నిమ్స్ వంటి ప్రతిష్టాత్మక వైద్యాలయాలు ఉన్నాయి. అమరావతికి కూతవేటు దూరంలో దక్షిణాదిలోనే ఖ్యాతి కలిగిన గుంటూరు ప్రభుత్వాసుపత్రి ఉంది. వాటి సహకారంతో రాజధాని నగరం అమరావతిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయానికీ, అనుబంధ ఆసుపత్రులు, పరిశోధనా భవనాల నిర్మాణానికి పూనుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పుకుని విదేశీ కార్పొరేట్ సంస్థకు వంద ఎకరాలు కేటాయించడం హేతుబద్ధమైన నిర్ణయం కాదని వైద్యులు అంటున్నారు. పైగా 2016 కల్లా 11 ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న ఊహాజనిత షరతుతో ఒప్పందం కుదుర్చుకోవడం విడ్డూరంగా నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

### ఎయిమ్స్ మాటేమిటి ...?

పునర్విభజన చట్టాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 3869 ఎకరాలను కేటాయించింది. అందులో ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కూడా ఉంది. ఎయిమ్స్ రాష్ట్రానికి అందుబాటులోకి రావడం నిజంగా ప్రజలకు వరమే. మరైతే, ఆ వరం ఏమైంది..? రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పరిధిలో భూమి కూడా కేటాయించింది. ఇంతవరకు ఎయిమ్స్ అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఈ దశలో దాని గురించి పట్టించుకోకుండా మరో కార్పొరేట్ ప్రైవేట్ వైద్య విశ్వవిద్యాలయం కోసం వంద ఎకరాల విలువైన భూమిని దారాదత్తం చేయడంలోని ఆంతర్యంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజధాని నగరంగా చెబుతున్న అమరావతి దాని చుట్టుపక్కల సీఆర్డీఏ పరిధిలో ఉన్న 29 గ్రామాల్లో ఒకే ఒక్క ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉంది. ఒక్క ప్రభుత్వం డిగ్రీ కాలేజీ కూడా లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల దుస్థితి దారుణంగా ఉంది. పై కప్పులు కూడా లేని పాఠశాలలు అనేకవ. కనీస స్థాయి ప్రభుత్వ విద్యను పూర్తి స్థాయిలో అటకెక్కించి, దారుణంగా నిర్లక్ష్యం చేస్తూ ఎవరి బాగు కోసం కార్పొరేట్ విద్యాసంస్థలకు భూములు అప్పగిస్తున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### భూమి రైతులది...దానం ప్రభుత్వానిది...

ప్రపంచ ప్రసిద్ది చెందిప అంతర్జాతీయ రాజధానిని అమరావతిలో నిర్మిస్తామని చెబుతూ పూలింగ్ పద్ధతిలో రైతుల నుంచి సేకరించిన భూమిని కారుచౌకగా రాష్ట్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు తెగనమ్మడం పై సర్వత్రా విమర్శలు పెల్లుబికుతున్నాయి. ఇటీవల కాలంలో నిర్వహించిన రెండు మంత్రివర్గ సమావేశాల్లో విట్‌కు 150, బి.ఆర్ షెట్టికి 100 ఎకరాలను కేటాయిస్తూ చేసిన తీర్మానాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారమన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భూములు కోల్పోయిన రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.






















Editor : Pattan Hussain Khan, Printed and Published by him on behalf of Vastitude media pvt ltd. Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP. 522237. Printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18